FOR ADS.......
ఆకాంక్ష
CONTACT : 8333818121

TGTEL/25/A1964
# తొలి ఆకాంక్ష
తెలుగు సంచలన దిన పత్రిక

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష TGTEL/25/A1964 akankshanews.com తెలుగు సంచలన దిన పత్రిక

ప్రచురణ : తెలంగాణ  సంపుటి : 01  సంచిక :117  ఎడిటర్ : పెనగొండ సతీష్  పేజీలు : 08,  వెల. 5రూ/  బుధవారం- 17 -డిసెంబర్ - 2025

## తిరుపతిలో 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణం



అర్చకులు, ఇతర సిబ్బంది వేతనాల్లో భారీ పెంపు

ముంబై బాంద్రాలో రూ.14.40 కోట్లతో శ్రీవారి ఆలయానికి ఆమోదం

టీటీడీ విద్యాసంస్థల్లో డిజిటల్ క్లాసులు, మధ్యాహ్న భోజన పథకం

రథాలు, ధ్వజస్తంభాల కోసం 100 ఎకరాల్లో దివ్య వృక్షాల పెంపకం

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి భక్తుల సౌకర్యం, సంస్థాగత బలోపేతం లక్ష్యంగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. తిరుపతిలో 20 ఎకరాల విస్తీర్ణంలో భారీ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మించాలని, ముంబైలోని బాంద్రాలో శ్రీవారి ఆలయాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించింది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ మేరకు ఆమోదం తెలిపారు.

## దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం



హెరాల్డ్ కేసులో పోలీస్, ఆర్థిక నేరాల విభాగం దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు.

ఈ కేసులో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవని కోర్టు సైతం స్పష్టం చేసిందని ఆయన తెలిపారు.

న్యూఢిల్లీ, డిసెంబర్ 16: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం చారిత్రాత్మకమని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అభివర్ణించారు. ఇలాంటి పథకానికి పేరు మార్చి వికసిత భారత్ మిగతా..2లో

## పవన్ కల్యాణ్‌ను కలిసిన యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్



★ విజయవాడ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశం
★ ద్వైపాక్షిక సహకారం, అభివృద్ధిపై ఇరుపక్షాల మధ్య చర్చ
★ సమావేశంలో పాల్గొన్న అమెరికా ఎంబసీ ప్రతినిధులు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. మంగళవారం నాడు విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. మిగతా..2లో

## ఖరీఫ్ ధాన్యం సేకరణలో ఏపీ ఆల్ టైమ్ రికార్డు...

ఖరీఫ్ సీజన్‌లో రికార్డు స్థాయిలో
25.04 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
రాష్ట్ర చరిత్రలోనే ఇది ఒక మైలురాయిగా
అభివర్ణించిన మంత్రి నాదెండ్ల మనోహర్
ఇప్పటికే రైతుల ఖాతాల్లోకి
రూ. 5,682 కోట్లు జమ చేసినట్టు వెల్లడి
రాష్ట్రవ్యాప్తంగా 3,500 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు ప్రభుత్వ విజ్ఞప్తి

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో 2025%-%26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త చరిత్ర సృష్టించింది. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ద్వారా ఈ సీజన్‌లో మునుపెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ధాన్యం సేకరించినట్టు రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. డిసెంబర్ 16వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా



## పంచాయతీ నిధులు, ఇందిరమ్మ ఇండ్లు మీ అబ్బ సొత్తు కావు...

● సర్పంచుల నిధులు రాజ్యాంగ బద్ధమైన హక్కు, ఎమ్మెల్యేల దయాదాక్షిణ్యాలు కావు
● అధికార మదంతో బెదిరింపులు చేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు...
● యూరియా కోసం రైతుల ముష్టి యుద్ధాలు...యాప్ పేరుతో కాంగ్రెస్ డ్రామా...
● సర్పంచుల హక్కుల కోసం న్యాయ పోరాటం జిల్లాకొక లీగల్ సెల్ ఏర్పాటు...
● తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..




హైదరాబాద్.డిసెంబర్16(ఆకాంక్ష): పంచాయతీ నిధులు,ఇందిరమ్మ ఇండ్లు మీ అబ్బ సొత్తు కావు. అధికార మదంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేల బెదిరింపులు సర్పంచుల హక్కుల కోసం పోరాటానికి సిద్ధం కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అధికార మదం తలకెక్కిందని, ప్రజలను మరియు ప్రజాప్రతినిధులను బెదిరించే స్థాయికి వారు దిగజారిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఖానాపూర్, షాద్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ఎమ్మెల్యేల బెదిరింపుల ధోరణిపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. మిగతా..2లో

## మోదీకి ఆ రెండు అంశాలు అసలే గిట్టవు



★ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై రాహుల్ గాంధీ ఆగ్రహం
★ రాహుల్ గాంధీ ఆలోచనలు, పేదల హక్కులు మోదీకి నచ్చవని వ్యాఖ్య
★ ఈ పథకాన్ని బలహీనపరచాలని పదేళు ్లగా చూస్తున్నారని ఆరోపణ

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఓ యూజ్‌లెస్ ఫెలో..

### నీకు దమ్ముంటే రాజీనామా చెయ్.....

❖ నీ మీద నేను పోటీ చేస్తా అని సవాల్...
❖ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌పై కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ నిప్పులు...




కోరుట్ల.డిసెంబర్ 16(ఆకాంక్ష) : జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌పై కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ నిప్పులు చెరిగారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఓ యూజ్‌లెస్ ఫెలో.. అతనికి కామన్ సెన్స్ లేదని మండిపడ్డారు. అసలు ఏ పార్టీనో తెలియని వ్యక్తి.. మాపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. నీకు దమ్ముంటే రాజీనామా చెయ్.. నీ మీద నేను పోటీ చేస్తా అని సవాల్ విసిరారు. రెండేళ్లలో జగిత్యాల సమస్యల గురించి ఒక్కరోజైనా అసెంబ్లీలో ప్రస్తావించావా అని సంజయ్ కుమార్‌ను కల్వకుంట్ల సంజయ్ నిలదీశారు. జగిత్యాల గురించి మాట్లాడే హక్కు నీకెక్కడిదని ప్రశ్నించారు.

## పేరు మార్చే సాకుతో పథకాన్ని రద్దు చేయొచ్చు

### 'వీబీ జీ రామ్ జీ' బిల్లుపై ప్రియాంక గాంధీ

● లోక్‌సభలో వికసిత్ భారత్ రోజ్ గార్, ఆజీవికా హామీ మిషన్ బిల్లు 2025
● తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్షాలు



ఢిల్లీ : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం రద్దుపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ పేరు తొలగింపుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పేరు మార్చే సాకుతో పథకాన్ని రద్దు చేయవచ్చన్న అనుమానం వ్యక్తం చేశారు. హామీ చట్టాన్ని రద్దు చేస్తూ ఆ స్థానంలో కేంద్రం కొత్తగా వికసిత్ భారత్ రోజ్ గార్, ఆజీవికా హామీ మిషన్ బిల్లు- 2025ను తీసుకొచ్చింది.

## దిల్లీ-ఆగ్రా ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రమాదం



★ దిల్లీ-ఆగ్రా హైవేపై 7 బస్సులు, 3 కార్లు ఢీ
★ 13మంది మృతి- 35మందికి గాయాలు!

ఢిల్లీ : ఉత్తర్?ప్రదేశ్?లో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. మంగళవారం తెల్లవారుజామున మధురలోని దిల్లీ- ఆగ్రా ఎక్స్‌ప్రెస్

## కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అధికార మదంతో వ్యవహరిస్తున్నారు

❖ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అధికార గర్వం పెరిగిపోయిందన్న కేటీఆర్
❖ ప్రభుత్వ నిధులు, ఇందిరమ్మ ఇళ్లు నేతల సొంత ఆస్తి కాదని స్పష్టీకరణ
❖ యూరియా కొరతను కప్పిపుచ్చుకునేందుకే కొత్త యాప్ డ్రామా
❖ బీసీ రిజర్వేషన్లు తగ్గించి రేవంత్ రెడ్డి మోసం చేశారని విమర్శలు
❖ మరో రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోవడం ఖాయం అని వ్యాఖ్యలు

హైదరాబాద్: రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు అధికార మదంతో, పెత్తందారీ ధోరణితో వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మిగతా..2లో



## తెలంగాణ తల్లికి అవమానం...!

ఫ్యూచర్ సిటీలో విగ్రహాన్ని కూల్చివేసిన సిబ్బంది

ప్రజల్లో తీవ్ర ఆగ్రహం...




హైదరాబాద్.డిసెంబర్16(ఆకాంక్ష) : తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా భావించే 'తెలంగాణ తల్లి' విగ్రహానికి అవమానం జరిగిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమం ముగిసిన వెంటనే, ఫ్యూచర్ సిటీ పరిధిలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని అక్కడి సిబ్బంది కింద పడేసిన ఘటన తీవ్ర విమర్శలకు దారి తీసింది. తెలంగాణ సంస్కృతి, పోరాట చరిత్రకు ప్రతీకగా నిలిచే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఈ విధంగా నిర్లక్ష్యంగా తొలగించడం పట్ల ప్రజలు, వివిధ సంఘాలు, రాజకీయ పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా విదేశీ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారుల సందర్శన నేపథ్యంలో ఫ్యూచర్ సిటీలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని అలంకారంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమాల సమయంలో ఆ విగ్రహం ముందు ఫోటోలు, వీడియోలు తీసుకుంటూ తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసిన నిర్వాహకులు, సమ్మిట్ ముగిసిన తర్వాత మాత్రం పూర్తిగా భిన్నంగా ప్రవర్తించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కార్యక్రమం పూర్తయిన వెంటనే విగ్రహాన్ని తొలగించే క్రమంలో సరైన గౌరవం చూపకపోవడం, చివరకు నేలకూల్చడం తీవ్ర అభ్యంతరకరమని పలువురు పేర్కొంటున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రజల్లో ఆగ్రహం మరింత పెరిగింది. "తెలంగాణ తల్లి విగ్రహం తాత్కాలిక అలంకార వస్తువా?" అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రాన్ని, తెలంగాణ ఉద్యమాన్ని, అమరుల త్యాగాలను ప్రతిబింబించే విగ్రహాన్ని ఈ స్థాయిలో నిర్లక్ష్యం చేయడం సరికాదని వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణ తల్లిని అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పలు ప్రజాసంఘాలు, సాంస్కృతిక సంఘాలు ఈ ఘటనను తీవ్రంగా ఖండించాయి. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలకు ఇది అవమానమని వారు పేర్కొన్నారు.

మొదటి పేజి తరువాయి

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఓ యూజ్‌లెస్ ఫెలో..

కేసీఆర్ పెట్టిన భిక్ష నీ జగిత్యాల ఎమ్మెల్యే పదవి అని వ్యాఖ్యానించారు. జగిత్యాల జిల్లా స్వప్నాన్ని కేసీఆర్ నెరవేర్చారని.. కానీ నీకు అవకాశం ఇచ్చిన కేసీఆర్‌ను, జగిత్యాల ప్రజలను మోసం చేసి స్వలాభం కోసం అధికార పార్టీలో చేరావని మండిపడ్డారు.జగిత్యాల జిల్లా ప్రజలకు కీలకమైన మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు రెండేళ్లుగా నత్తనడకన నడుస్తుంటే ఏం చేస్తున్నావని సంజయ్‌కుమార్‌ను కల్వకుంట్ల సంజయ్ ప్రశ్నించారు. కోరుట్ల ప్రజలు జగిత్యాల ఆస్పత్రికి వస్తే ఎందుకొచ్చారని అంటున్నారని ఆయన మండిపడ్డారు. అసలు నీకు కామన్‌సెన్స్ ఉందా అని సంజయ్‌కుమార్‌పై ధ్వజమెత్తారు. మరి నీ నడుంనొప్పికి హైదరాబాద్ ఎందుకు వెళ్తున్నావని ప్రశ్నించారు. రేపు పొద్దున జగిత్యాల కలెక్టర్‌కు కోరుట్ల ప్రజలు ఎందుకొస్తున్నారని ప్రశ్నిస్తారా అని నిలదీశారు. జగిత్యాల జిల్లా హెడ్‌క్వార్టర్ కాబట్టి జిల్లాలోని ప్రజలందరూ వస్తారని ఆయన గుర్తుచేశారు. సంజయ్‌కుమార్ మాటలు చూస్తుంటే ఆయన రాజకీయ అభద్రతతను చాటుతున్నాయని ఎద్దేవా చేశారు.

## తెలంగాణ తల్లికి అవమానం...!

గ్లోబల్ సమ్మిట్ పేరుతో రాష్ట్ర ప్రతిష్టను ప్రపంచానికి చాటాలని చెప్పుకునే ప్రభుత్వం, ఆ సమ్మిట్ పూర్తయిన తర్వాత మాత్రం తెలంగాణ తల్లిని ఈ విధంగా నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమని విమర్శించారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణమని ఆరోపిస్తున్నారు.రాజకీయ వర్గాల్లోనూ ఈ ఘటనపై స్పందనలు వెల్లువెత్తుతున్నాయి. పాలకుల నిర్లక్ష్య ధోరణి వల్లే ఇలాంటి అవమానాలు జరుగుతున్నాయని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి జరిగిన అవమానంపై ప్రభుత్వం వెంటనే స్పందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు, ఇది కేవలం సాంకేతిక కారణాల వల్ల జరిగిన ఘటన అంటూ కొందరు అధికారులు సమర్థించుకునే ప్రయత్నం చేసినా, ప్రజలు మాత్రం ఆ వివరణను అంగీకరించడం లేదు. తెలంగాణ తల్లి విగ్రహం అనేది కేవలం ఒక శిల్పం మాత్రమే కాదని, కోట్లాది తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉన్న ప్రతీక అని సామాజికవేత్తలు గుర్తు చేస్తున్నారు. అలాంటి ప్రతీకను తాత్కాలిక అవసరాల కోసం ఉపయోగించి, పని అయిపోయాక నిర్లక్ష్యంగా తొలగించడం సమంజసం కాదని వారు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని సూచిస్తున్నారు.మొత్తానికి, గ్లోబల్ సమ్మిట్ ముగిసిన వెంటనే ఫ్యూచర్ సిటీలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూల్చివేసిన ఘటన రాష్ట్రంలో రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. తెలంగాణ తల్లికి జరిగిన ఈ అవమానంపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో అన్నది ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

## జోర్డాన్- భారత్ పాత సంబంధాలను పునరుద్ధరించుకోవాలి

ఢిల్లీ : ప్రపంచానికి కొత్త వృద్ధి ఇంజిన్, సరఫరా గొలుసు అవసరం ఉందని ఈ డిమాండ్‌ను తీర్చడంలో భారత్, జోర్డాన్‌లు కలిసి కీలక పాత్ర పోషించగలవని ప్రధాని నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధాని మూడో దేశాల పర్యటనలో భాగంగా జోర్డాన్‌లో పర్యటిస్తున్న మోదీ అమ్మాన్‌లో జరిగిన భారత్- జోర్డాన్ బిజినెస్ ఫోరమ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ప్రధాని జోర్డాన్‌కు భారత్ మూడో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉందని గుర్తు చేశారు. జోర్డాన్‌తో దీర్ఘకాలిక సంబంధాన్ని నిర్మించుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఒకప్పుడు గుజరాత్ నుంచి పెట్రా మీదుగా ఐరోపాకు వాణిజ్యం జరిగేదని ప్రధాని గుర్తు చేసుకున్నారు. ఇరుదేశాల భవిష్యత్ శ్రేయస్సు కోసం పాత సంబంధాలను పునరుద్ధరించుకోవాలని మోదీ సూచించారు. ‘భారత వృద్ధి రేటు 8 శాతానికి పైగా ఉంది. ఉత్పాదకత, సుపరిపాలన, ఆవిష్కరణల ఆధారిత విధానాల ఫలితంగా ఇది సాధ్యమైంది. జోర్డాన్ నుంచి వచ్చే వ్యాపారులు, పెట్టుబడిదారులకు కొత్త అవకాశాల ద్వారాలు తెరుచుకుంటున్నాయి.భారత్ వేగవంతమైన వృద్ధిలో మీరు భాగస్వామి కావచ్చు. మీ పెట్టుబడులపై గొప్ప రాబడి కూడా వస్తుంది. ఇవాళ ప్రపంచానికి ఒక కొత్త వృద్ధి చోదకం కావాలి. విశ్వసనీయమైన సరఫరా గొలుసు అవసరం ఉంది. ఈ అవసరాన్ని తీర్చడంలో భారత్, జోర్డాన్‌లు కలిసి కీలక పాత్ర పోషించగలవు’ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

## పవన్ కల్యాణ్‌ను కలిసిన యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్

ముఖ్యంగా వివిధ రంగాల్లో సహకారం, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఇరువురు తమ ఆలోచనలను పంచుకున్నారు. పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన అవసరంపై చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశంలో లారా విలియమ్స్‌తో పాటు యూఎస్ ఎంబసీకి చెందిన మెరెడిత్ మెట్జలర్, పబ్లిక్ డిప్లమసీ ఆఫీసర్ అబ్దుల్ రెహ్మాన్ హబీబ్, పొలిటికల్ స్పెషలిస్ట్ శ్రీమాలి కారి, ఎకనమిక్ స్పెషలిస్ట్ శిబా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. రాజకీయ, ఆర్థిక రంగ నిపుణులు ఈ భేటీలో పాల్గొనడం గమనార్హం.

## తిరుపతిలో 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణం

సమావేశం అనంతరం ఛైర్మన్ బీఆర్ నాయుడు మీడియాకు వివరాలు వెల్లడించారు. భక్తుల కోసం తిరుపతిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ ప్లానింగ్, ఆర్కిటెక్ట్ నియామకానికి బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. అదేవిధంగా, ముంబై బాంద్రాలో రూ.14.40 కోట్లతో శ్రీవారి ఆలయ నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. టీటీడీ ఆలయాల్లోని ధ్వజస్తంభాలు, రథాల తయారీకి అవసరమైన కలప కోసం పలమనేరులో 100 ఎకరాల్లో దివ్య వృక్షాలను పెంచే ప్రతిపాదనకు కూడా ఆమోదముద్ర వేశారు.

### ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

ఈ సమావేశంలో టీటీడీ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లో పనిచేస్తున్న 62 మంది అర్చకులు, పరిచారకులు, పోటు వర్కర్లు, ప్రసాదం డిస్ట్రిబ్యూటర్ల వేతనాలను గణనీయంగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీని ప్రకారం అర్చకుల వేతనాన్ని రూ.25 వేల నుంచి రూ.45 వేలకు, పరిచారకులకు రూ.23,140 నుంచి రూ.30,000కు పెంచారు. పోటు వర్కర్లకు, ప్రసాదం పంపిణీ సిబ్బందికి కూడా వేతనాన్ని రూ.30,000కు పెంచుతూ తీర్మానించారు. శ్రీవారి ఆలయంలో ప్రధాన సన్నిధి యాదవతో పాటు అదనంగా మరో సన్నిధి యాదవ పోస్టు భర్తీకి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

### విద్య, వైద్య రంగాలకు ప్రోత్సాహం

విద్యా, వైద్య రంగాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పాలకమండలి ఆమోదం తెలిపింది. తిరుపతి పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో అత్యాధునిక సౌకర్యాల కోసం అదనంగా రూ.48 కోట్లు కేటాయించారు. టీటీడీ ఆధ్వర్యంలోని 31 విద్యాసంస్థల్లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, సీసీ కెమెరాల ఏర్పాటుకు, ఎస్వీ జూనియర్, ఎస్వీడబ్ల్యూ జూనియర్ కళాశాలల్లో డేస్కాలర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఇంజినీరింగ్ విభాగంలో 60 పోస్టుల భర్తీకి, శ్రీవారి పోటులో 18 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వ అనుమతి కోరాలని తీర్మానించారు. తిరుమలలోని రహదారులు, కూడళ్లకు వైష్ణవ పురాణాలు, అన్నమాచార్య సంకీర్తనలలోని శ్రీవారి నామాలను పెట్టేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. తలకోనలోని సిద్ధేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.14.10 కోట్లు మంజూరు చేశారు. ఈ నిర్ణయాలన్నీ భక్తులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, టీటీడీని మరింత బలోపేతం చేసేందుకు దోహదపడతాయని ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరించారు.

## దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం

జీ రామ్ జీగా ప్రస్తుతం నామకరణం చేశారని మంగళవారం న్యూఢిల్లీలో ఆయన విమర్శించారు. మహాత్మా గాంధీ పేరు తొలగించడం ఆర్‌ఎస్‌ఎస్ బీజేపీ ఆలోచనకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ పథకాన్ని బలపర్చకుండా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎంపీ నిప్పులు చెరిగారు. కేంద్ర - రాష్ట్ర నిధుల వాటా 40:60గా మార్చడంతో రాష్ట్రాలపై భారం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాల్లో నిధులు లేకపోతే పథకం అమలు కష్టమయ్యే పరిస్థితి ఉందన్నారు. 125 రోజులు అంటూనే ఉపాధి హామీని అస్పష్టంగా మార్చారంటూ కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకానికి దేవుడి పేరు పెట్టి ప్రజలను తప్పు దోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారంటూ కేంద్రం తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. మహాత్మా గాంధీ పేరును చరిత్ర నుంచి తొలగించాలన్న ఉద్దేశంతోనే ఇలా చేశారని విమర్శించారు. ఈ పథకం పేరుతోపాటు అమలులో తీసుకు వచ్చిన మార్పులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలకు కాంగ్రెస్ పార్టీ దిగుతుందని ఎంపీ చామల స్పష్టం చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో 2005లో ఉపాధి హామీ పథకం ప్రారంభమైందని గుర్తు చేశారు. గ్రామీణ పేద ప్రజలకు 100 రోజుల గ్యారెంటీ ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో అప్పటి కేంద్రం 100% నిధులు కేటాయించిందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. మరోవైపు నేషనల్ హెరాల్డ్ కేసులో పోలీస్, ఆర్థిక నేరాల విభాగం దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కేసులో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవని కోర్టు సైతం స్పష్టం చేసిందని తెలిపారు. రాహుల్, సోనియా గాంధీలపై కక్ష సాధింపు రాజకీయాలే లక్ష్యంగా ఈడీ కేసు నమోదు చేసిందని ఆరోపించారు. బలమైన ప్రాంతీయ నాయకత్వాన్ని నిర్వీర్యం చేయడానికే కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తోందంటూ బీజేపీపై ఎంపీ చామల ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మోదీకి ఆ రెండు అంశాలు అసలే గిట్టవు

హైదరాబాద్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) పేరు మార్పుపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రెండు అంశాలు అసలే గిట్టవని ఆయన అన్నారు. ఒకటి రాహుల్ గాంధీ ఆలోచనలు, రెండోది పేదల హక్కులంటే ఆయనకు ఇష్టం ఉండదని విమర్శించారు. గాంధీజీ గ్రామ స్వరాజ్యం ఆలోచనలకు ప్రతిరూపమే గ్రామీణ ఉపాధి హామీ పథకమని, అలాంటి పేరు మార్పు సముచితం కాదని అభిప్రాయపడ్డారు. ఈ పథకం పేరు మార్పు బిల్లు మహాత్మా గాంధీ ఆలోచనలకు అవమానమని ఆయన అభివర్ణించారు. 2014 నుంచి ఈ పథకాన్ని బలహీనపరిచేందుకు కుట్రలు జరుగుతున్నాయని మోదీపై విమర్శలు గుప్పించారు.

# పంచాయతీ నిధులు, ఇందిరమ్మ ఇండ్లు మీ అబ్బ సొత్తు కావు...

మొదటి పేజి తరువాయి

గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు ఎవరి భిక్ష కాదని, అవి రాజ్యాంగ బద్ధమైన హక్కులని స్పష్టం చేశారు.సభను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తూ గ్రామాల్లో భయాందోళన వాతావరణం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఒక ఎమ్మెల్యే బహిరంగంగా ‘నన్ను ఓడిస్తే చంపేస్తా’ అనే స్థాయిలో మాట్లాడటం ప్రజాస్వామ్యానికి మచ్చ అని మండిపడ్డారు. అలాంటి మాటల వల్ల గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు అరాచకాలకు దిగుతున్నారని, సర్పంచులు ఎవరూ ఈ బెదిరింపులకు భయపడవద్దని ఆయన పిలుపు నిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం, పంచాయతీ నిధులు విడుదల చేయడం ఎమ్మెల్యేల దయాదాక్షిణ్యాలు కాదని, అవి వారి వ్యక్తిగత సొత్తులు కూడా కాదని స్పష్టంగా చెప్పారు. రేవంత్ రెడ్డి గానీ, కాంగ్రెస్ నేతలు గానీ తమ భూములు అమ్మి గ్రామాలకు నిధులు ఇవ్వడం లేదని, ప్రజల సొమ్ముకు వారు కేవలం ధర్మకర్తలు మాత్రమేనని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులపై కాంగ్రెస్ నేతలు పెత్తనం చెలాయించాలని చూస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం గ్రామ పంచాయతీలకు స్వయం ప్రతిపత్తి ఉందని గుర్తు చేశారు. కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నుంచి రావాల్సిన నిధుల్లో ఎక్కువ భాగం నేరుగా గ్రామ పంచాయతీలకే చేరాలని, ఆ నిధులను ఆపే హక్కు ఏ ముఖ్యమంత్రికి



గానీ, ఎమ్మెల్యేకు గానీ లేదని స్పష్టం చేశారు. రెండు సంవత్సరాలుగా గ్రామ పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు సర్పంచులకు ఏం ఇస్తుందనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. నిధుల కోసం ప్రపంచ బ్యాంకుకు ఉత్తరాలు రాస్తున్న ప్రభుత్వానికి గ్రామాల అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఎద్దేవా చేశారు.కేసీఆర్ పాలనలో తెలంగాణ పల్లెలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కేటీఆర్ గుర్తుచేశారు. ప్రతి గ్రామానికి ట్రాక్టర్లు, ట్యాంకర్లు, నర్సరీలు, వైకుంఠ ధామాలు వచ్చాయని, జాతీయ స్థాయిలో అనేక అవార్డులు సాధించాయని తెలిపారు. కానీ కాంగ్రెస్ పాలనలో గ్రామాలు అనాథలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాక్టర్లకు డీజిల్ కూడా వేయలేని పరిస్థితి నెలకొందని, రైతులు యూరియా కోసం లైన్లలో నిలబడి అవస్థలు పడుతున్నారని అన్నారు. రైతుల కష్టాలు కనిపించకుండా చేయడానికి ‘యూరియా యాప్’ పేరుతో ప్రభుత్వం డ్రామా ఆడుతోందని విమర్శించారు. షాపుల్లో దొరకని యూరియా యాప్‌లో దొరుకుతుందా అని ప్రశ్నించారు. సర్పంచ్ ఎన్నికల కోసం ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాలు తిరిగి ప్రచారం చేయడం చరిత్రలో ఎప్పుడూ లేదని కేటీఆర్ అన్నారు. ఎన్టీఆర్, వైఎస్‌ఆర్, కేసీఆర్ వంటి నాయకులు ఎవరూ సర్పంచ్ ఎన్నికల కోసం రోడ్లపై తిరగలేదని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే విజయోత్సవాల పేరుతో పరోక్ష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా రెండేళ్లే కొనసాగుతుందని, మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. సర్పంచులు ఐదేళ్ల కాలానికి గెలిచారని, మిగిలిన కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి పనులు చేసుకుంటారని భరోసా ఇచ్చారు. ఖానాపూర్, షాద్‌నగర్ గడ్డపై మళ్లీ గులాబీ జెండా ఎగురడం ఖాయమని చెప్పారు.సర్పంచుల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్‌ఎస్ పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని కేటీఆర్ హామీ ఇచ్చారు. జిల్లాకొక ప్రత్యేక లీగల్ సెల్ ఏర్పాటు చేయడంతో పాటు, స్థానిక ప్రజాప్రతినిధులకు శిక్షణా శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల బెదిరింపులకు లొంగకుండా, రాజ్యాంగం ఇచ్చిన హక్కుల కోసం ఐకమత్యంతో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఖానాపూర్ ఇంచార్జీ జాన్సన్ నాయక్‌తో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖరీఫ్ ధాన్యం సేకరణలో ఏపీ ఆల్ టైమ్ రికార్డు...

# ఇది చారిత్రాత్మకం: మంత్రి నాదెండ్ల

మొదటి పేజి తరువాయి



రైతుల నుంచి ఏకంగా 25.04 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. దీని విలువ సుమారు రూ.5,938.20 కోట్లు ఉంటుందని, రాష్ట్ర చరిత్రలోనే ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు మద్దతు ధర అందించడంలో ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో ఉందని మంత్రి స్పష్టం చేశారు. ధాన్యం సేకరణకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన మొత్తంలో ఇప్పటికే అత్యధిక భాగం చెల్లింపులు పూర్తి చేశామన్నారు. ఇప్పటివరకు 3,79,538 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.5,682.77 కోట్లు జమ చేసినట్లు వివరించారు. మిగిలి ఉన్న రూ.255.43 కోట్ల బకాయిలను కూడా తదుపరి బ్యాంకు బ్యాచ్ ప్రాసెసింగ్‌లో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తోందని తెలిపారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందని నాదెండ్ల మనోహర్ అన్నారు. సేకరణ కేంద్రాల్లో అవసరమైన గోనె సంచులు, రవాణా వాహనాలు, టార్పాలిన్లను సమృద్ధిగా అందుబాటులో ఉంచామన్నారు. రైతులు తమ ధాన్యం విక్రయించే క్రమంలో ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే తక్షణమే స్పందించేందుకు విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. 1967 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చని, ప్రభుత్వ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం ఉన్నట్లయితే, 24 గంటల్లోనే మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుల సౌకర్యార్థం 3,500 ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులను ఆశ్రయించి, ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకుని నష్టపోవద్దని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారిక కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించి, సరైన ప్రతిఫలం పొందాలని సూచించారు.

# ఢిల్లీ-ఆగ్రా ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రమాదం

మొదటి పేజి తరువాయి


భారీగా మంటలు చెలరేగాయి. ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య 13కు చేరింది. మరో 35 మంది గాయపడ్డారు. మరోవైపు ఈ ఘటనపై స్పందించిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఎక్స్?గ్రేషియా ప్రకటించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, మధురలో బల్దేవ్ పోలీస్ స్టేషన్? ప్రాంతంలో మైలురాయి నంబర్ 127 సమీపంలో జరిగింది. మంగళవారం తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు పొగమంచు కారణంగా ఏడు బస్సులు, మూడు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ క్రమంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి కార్లు, బస్సులు దగ్ధమయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది 11యంత్రాలతో మంటలను అదుపు చేశాయి. ఈ ప్రమాదంతో ఘటనాస్థలంలో భీతావహ పరిస్థితి నెలకొంది. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 13మంది మరణించినట్లు అధికారులు పేర్కొన్నారు. క్షతగ్రాతులను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు.

### ఎక్స్?గ్రేషియా ప్రకటించిన సీఎం యోగి

ఈ రోడ్డు ప్రమాదంపై ఉత్తర్?ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.

### పొగమంచు కారణంగానే ప్రమాదం : మధుర ఎస్?పీ

దట్టమైన పొగమంచు కారణంగా ఈ ప్రమాదం జరిగిందని మధుర ఎస్?పీ శ్లోక్ కుమార్ తెలిపారు. అయోధ్య నుంచి ఢిల్లీ వెళ్తున్న బస్సులు ఢీకొన్నాయని ఆ తర్వాతే మంటలు చెలరేగాయని తెలిపారు. సమాచారం అందిన వెంటనే అధికారులు, అగ్నిమాపక దళం ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయని తెలిపారు. వెంటనే 20 అంబులెన్స్‌లు కూడా ఘటనా స్థలానికి చేరుకున్నాయని చెప్పారు. ప్రస్తుతం సహాయక చర్యలు పూర్తయ్యాయని చెప్పారు. ఇప్పటివరకు నలుగురు మరణించారని, క్షతగాత్రుల్లో ఎవరికీ తీవ్ర



గాయాలు కాలేదని తెలిపారు. కాలిపోయిన వాహనాలను సంఘటన స్థలం నుంచి తొలగించినట్లు చెప్పారు. సురక్షితంగా ఉన్న ప్రయాణికులను ప్రభుత్వ బస్సుల్లో ఇంటికి పంపించినట్లు జిల్లా మేజిస్ట్రేట్ చంద్రప్రకాశ్ సింగ్ తెలిపారు. బస్సులు ఢీకొనగానే పెద్ద శబ్దంతో మంటలు చెలరేగాయని ప్రత్యక్షులు చెబుతున్నారు. బస్సులో ఉన్న ప్రయాణికులు కేకలు వేస్తూ, ప్రాణాలను కాపాడుకోవడానికి ప్రజలు కిటికీల నుంచి దూకారని తెలిపారు.

## పేరు మార్చే సాకుతో పథకాన్ని రద్దు చేయొచ్చు- ‘వీబీ జీ రామ్ జీ’ బిల్లుపై ప్రియాంక గాంధీ

మొదటి పేజి తరువాయి

ఈ బిల్లును కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మంగళవారం లోక్?సభలో ప్రవేశపెట్టారు. కేంద్ర ప్రభుత్వ చర్యను విపక్ష ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లును పార్లమెంటరీ స్థాయి సంఘానికి పంపాలని డిమాండ్ చేశారు. లోక్?సభ నుంచి వాకౌట్? చేసి పార్లమెంట్ ప్రాంగణంలో విపక్షాలు నిరసనలు వ్యక్తం చేశాయి. మహాత్మా గాంధీ పేరు తొలగింపుపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ అభ్యంతరం తెలిపారు. నూతన బిల్లు ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరుస్తుందని వ్యాఖ్యానించారు. వెంటనే దీనిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ‘ప్రభుత్వం పేర్లు మార్చడంలో నిమగ్నమై ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఇది అనవసరమైన ఖర్చుకు దారితీస్తుంది. ఈ పథకానికి మహాత్మా గాంధీ పేరు పెట్టారు. ఆయన జాతిపిత. ఇప్పుడు పేరును మార్చడం లేదా దానిని తొలగించడం ఆయనను అగౌరవపరచడమే అవుతుంది. ఎంజీనరేగాను ఆమోదించేటప్పుడు ఒక్క జాతీయ పార్టీ కూడా దీనిని వ్యతిరేకించలేదు. ఇది అందరి సమ్మతితో రూపొందించింది. అలాగే ఉపాధిని 100 నుంచి 125 రోజులకు పెంచుతామని ప్రతిపాదన కూడా తప్పుదారి పట్టించేది. పైకి చూస్తే వారు పనిదినాలను పెంచుతున్నట్లు కనిపిస్తోంది. కానీ జాగ్రత్తగా గమనిస్తే ఈ పథకం ముగిసిపోవచ్చు’





అని ప్రియాంక గాంధీ ఆరోపించారు.

### రాష్ట్రాలపై ఆర్థిక భారం : ప్రియాంక గాంధీ

ఈ పథకం నిధులను కేంద్రం అందించే వాటాను చాలా రాష్ట్రాలకు 60 శాతాన్ని తగ్గించాలని ప్రియాంక గాంధీ ఎత్తిచూపారు. గతంలో, 90 శాతం ఆర్థిక బాధ్యత కేంద్రంపైనే ఉండేది. ఇప్పుడు పథకాన్ని కొనసాగించాలని కోరుకుటుంది. కానీ భారాన్ని రాష్ట్రాలపైకి మారుస్తోంది. పేద రాష్ట్రాలు దీనిని భరించలేవు. చివరికి ఈ పథకం కూలిపోతుంది. గతంలో గ్రామ పంచాయితీలు ఈ పథకం కింద పని చేయించేవని, కొత్త బిల్లుతో ఆ హక్కులను దూరం చేస్తుంది. ఎవరి ఇష్టానుసారంగానో బిల్లులను ఆమోదించుకుంటామంటే కుదరదు. ఈ బిల్లును తక్షణమే కేంద్రం ఉపసంహరించుకోవాలి. మహాత్మా గాంధీ మా కుటుంబానికి చెందిన వ్యక్తి కాదు కానీ, మా కుటుంబసభ్యుడితో సమానం. గాంధీజీని యావత్ దేశం అలాగే భావిస్తోంది’ అని ప్రియాంక గాంధీ తెలిపారు.

### పేరు మార్చడం గాంధీ ఆదర్శాలను విస్మరించినట్లే : శశి థరూర్

మరోవైపు ఈ బిల్లును కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్? కూడా వ్యతిరేకించారు. ఈ పథకానికి గాంధీ పేరును తొలగించడం అనైతికమని పేర్కొన్నారు. అంతేగాక, రాముడి పేరును అపవిత్రం చేయొద్దంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ, ఎక్స్?లో పోస్ట్ చేశారు. ఎంజీనరేగా పేరు మార్చి, కేంద్రం కొత్తగా జీ రామ్ జీ బిల్లు తీసుకురావడంపై జరుగుతున్న వివాదం దురదృష్టకరమని అన్నారు. గ్రామ స్వరాజ్ సిద్ధాంతాలు, రామరాజ్య ఆదర్శాలు ఎన్నటికీ ఒకదానితో ఒకటి పోటీపడేవి కాదని పేర్కొన్నారు. గాంధీజీ దృక్పథానికి అవి రెండు మూల స్తంభాల్లాంటివని తెలిపారు. ఇప్పుడు పథకానికి పేరు మార్చడం అంటే ఆయన ఆదర్శాలను విస్మరించినట్లే అవుతుందని ఆరోపించారు. ఆయన వారసత్వాన్ని అగౌరపర్చే ప్రయత్నం చేయొద్దని శశి థరూర్? తెలిపారు.

# 9 కేంద్రీయ, 16 నవోదయ విద్యాలయాలను మంజూరు చేయండి

మొదటి పేజి తరువాయి

4 లక్షల మందికి మెరుగైన విద్య అందుతుంది : తెలంగాణలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు సహకరించాలని రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. ఈ భేటీలో తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను కేంద్ర మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణలో 105 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ఈ స్కూల్స్‌తో ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 లక్షల మంది విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని నిర్మలా సీతారామన్‌కు రేవంత్ తెలిపారు. ఈ స్కూల్స్ నిర్మాణం, ఇతర విద్యా సంస్థల ఏర్పాటుకు 30 వేల కోట్ల రూపాయల వ్యయమవుతుందని వివరించారు. ఈ స్కూల్స్ కోసం తీసుకునే రుణాలను ఎస్‌ఆర్బీఎం నుంచి మినహాయించాలని కేంద్ర ఆర్థికమంత్రిని కోరారు.

### కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రేవంత్ రెడ్డి

సానకూలంగా స్పందించిన ధర్మేంద్ర ప్రదాన్ : తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసిన రేవంత్ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. హైదరాబాద్?కు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ మంజూరు చేయాలని కోరారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన 200 ఎకరాల భూమిని ఇప్పటికే గుర్తించినట్లు కేంద్ర మంత్రికి తెలిపారు. వెంటనే తరగతులు ప్రారంభించడానికి ట్రాన్సిట్ క్యాంపస్ కూడా సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి కేంద్రమంత్రికి వివరించారు. ఐఐఎం ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తే అవసరమైన వసతులు కల్పిస్తామని తెలిపారు. తెలంగాణలో పెరిగిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా 9 కేంద్రీయ విద్యాలయాలు, 16 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని కేంద్ర



మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఆయా కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు అవసరమైన స్థలం, ఇతర వసతులు కల్పించడానికి సిద్ధంగా ఉన్నట్టు వివరించారు. సానకూలంగా స్పందించిన ధర్మేంద్ర ప్రదాన్ యంగ్ ఇండియా స్కూల్స్ ప్రాజెక్టు డీపీఆర్ పంపాలని రేవంత్‌కు చెప్పారు. డీపీఆర్?ను పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని ప్రదాన్ చెప్పినట్టు ఆయనతో భేటీ తర్వాత ముఖ్యమంత్రి వివరించారు. సీఎం దూరదృష్టిని అభినందించిన సోనియా గాంధీ : కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని రేవంత్ రెడ్డి కలిశారు. పార్లమెంటుకు వచ్చే ముందు సోనియాతో భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌ను సోనియాకు అందించిన సీఎం రెండేళ్లుగా అమలవుతున్న పథకాలు, పనులను వివరించారు. సీఎం దూరదృష్టిని సోనియా అభినందించారని సీఎంవో తెలిపింది.

# సంపాదకీయం

## మరో పదేళ్లకు నిశ్శబ్ద విప్లవానికి విజయమేనా

వాస్తవాలకూ భావాలకూ మధ్య సంబంధం ఎప్పుడూ సంక్లిష్టమైనదే. ఏదో కారణంతో ఎప్పుడో ఒకప్పుడు ఏర్పరచుకున్న భావాలను ఒకపట్టాన మార్చుకోలేం. వాస్తవాలు మారినప్పుడు వాటి ఆధారంగా ఏర్పడిన భావాలూ మారాలి. అదంత తేలికకాదనే సంగతి ఏ సమాజ చరిత్రను చూసినా అర్ధమవుతుంది. భౌతిక, జీవ, రసాయన విజ్ఞానాల విషయంలో భావాలను మార్చుకోటానికి అందరమూ సంసిద్ధంగానే ఉంటాం. సామాజిక వాస్తవాల దగ్గరికి వచ్చేటప్పటికి అంతటి సంసిద్ధతను వ్యక్తంచేయలేం. అసలు కొన్ని సామాజిక వాస్తవాలను అంగీకరించటానికి కూడా మనం ఇష్టపడం. ప్రతిభ అనేది పూర్తిగా పుట్టుకతో రాదనీ దానికీ మనం అనుభవించే సామాజిక హెూదాలకూ, లభ్యమయ్యే వెసులుబాట్లకూ సంబంధం ఉందంటే.. కాదని చెప్పేందుకు ఆధునిక, సనాతన సిద్ధాంతాలు చాలా ఉన్నాయి. సమాజ కట్టుబాట్ల కారణంగా కొన్ని సామాజిక వర్గాలు వివిధ రంగాల్లో వెనుకబడి ఉన్నాయన్న విషయాన్ని అంగీకరించని పరిస్థితి నిన్నమొన్నటివరకూ ఉండేది. అట్లాగే కొన్ని సామాజిక వర్గాలు ఇటీవల గణనీయంగానే ముందంజ వేస్తున్నాయంటే కాదని వాదించే పరిస్థితీ ఉంది. మారుతున్న సామాజిక వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని భావాలను సరిచూసుకోవటమూ, సరిదిద్దుకోవటమూ ఎంతో సంఘర్షణతో కూడుకున్నది. కష్టమైనా, నష్టమైనా ఆ సంఘర్షణను ఎల్లకాలమూ వాయిదా వేయలేం. మారుతున్న సామాజిక వాస్తవాలు ఏదోరూపంలో బలంగా ముందుకు తోసుకువస్తూనే ఉంటాయి. అవి పెట్టే రాపిడితో పాతకాలం నాటి వాస్తవాల ఆధారంగా ఏర్పరచుకున్న భావాలను మార్చుకోక తప్పనిసరి పరిస్థితీ ఎదురవుతుంది. ఉన్నత విద్యారంగంలో అగ్రకులాలు అగ్రభాగాన ఉన్నారంటే ఎవ్వరికీ సందేహం రాదు. మన సామాజిక వాస్తవం అలాంటిది. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచీ 2011%-%12 సంవత్సరం వరకూ ఇదే పరిస్థితి ఉంది. జనాభాలో పావువంతుకు కాస్త అటుఇటుగా ఉండే అగ్రకులాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యారంగంలో 57.1శాతం ఆనాటికి ఉన్నారు. ఆ తర్వాత పరిస్థితి మారింది. 2022%-%2023 సంవత్సరానికి వచ్చేటప్పటికీ మార్పు కొట్టొచ్చినట్లుగా కనపడింది. 2011%-%12 నాటికి ఉన్నత విద్యారంగంలో 42.9 శాతం మాత్రమే ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సంఖ్య 2022%-%23కు వచ్చేసరికి 60.9 శాతానికి చేరింది. దీనికి భిన్నంగా మరో విచిత్రం కూడా జరుగుతోంది. ఉన్నత విద్యారంగంలో అగ్రకుల (ఓసీలు) విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఇదొక నమ్మలేని నిజం! 2011%-%12 పోల్చితే ఆ తర్వాత 13 ఏళ్లల్లో ఉన్నత విద్యారంగం బాగా విస్తరించింది. ఈ విస్తరణతో ఓసీ విద్యార్థుల సంఖ్య మొత్తంగా ఎంతోకొంత పెరగాలి. కానీ ఆ కాలంలో 11 లక్షల మంది ఓసీ విద్యార్థులు తగ్గారు. 2010%-%11లో 1.83 కోట్ల ఓసీ విద్యార్థులు ఉన్నత విద్యారంగంలో ఉంటే 2022%-%23 నాటికి ఆ సంఖ్య 1.72 కోట్లకు పడిపోయింది. ఓసీలకు మాత్రమే లబ్ధి చేకూర్చటానికి తీసుకువచ్చిన 10శాతం ఈడబ్ల్యూసీ రిజర్వేషన్లు కూడా ఈ తరుగుదలను ఆపలేకపోయాయి. ఉన్నత విద్యారంగంలో మార్పులు ఆషామాషీవి కావు. సమాజంలో మారుతున్న బలాబలాలకు ఉన్నత విద్యారంగం ఎప్పుడూ బలమైన సూచికగానే ఉంటుంది. విద్యారంగానికి తోడు ఉద్యోగ రంగంలో కూడా సామాజికవర్గాల వారీ ఖచ్చితమైన గణాంకాలు సేకరించినప్పుడు ఇప్పటికే వచ్చిన మార్పులూ సమీప భవిష్యత్తులో రానున్న మార్పులూ స్పష్టంగా తెలుస్తాయి. ఇప్పటికైతే ఉద్యోగాల గురించి దేశవ్యాప్త సమాచారం లేదు. ఉన్నత విద్యారంగం గురించి మాత్రం అటువంటి సమాచారమూ, దాని విశ్లేషణా అందుబాటులో ఉంది. ఉదయ్‌పూర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)కు సంబంధించిన 'సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్' విభాగం.. కేంద్ర విద్యాశాఖ ఏటా ప్రచురించే నివేదికలను విశ్లేషించి మారుతున్న సామాజిక చిత్రాన్ని మనకు అందించింది. కేంద్ర విద్యాశాఖ ప్రచురించే నివేదికలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి కాబట్టి.. ఐఐఎంకు చెందిన ముగ్గురు అధ్యాపకులు వెంకటరామన్ కృష్ణమూర్తి, త్యాగరాజన్ జయరామన్, దీనా బెనర్జీలు అంకెల విషయంలో చాలా జాగ్రత్త వహించారు. పేజీపేజీకి అధికారిక అంకెలనూ వాటి మూలాలనూ స్పష్టంగా పేర్కొన్నారు. పదమూడు ఏళ్లలో దేశంలో రిజర్వేషన్ల శాతాల్లో పెద్దగా మార్పులు రాలేదు. వాటిని పెంచటానికి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు తీసుకువచ్చినా అవి కోర్టుల జోక్యంతో అమలుకాలేదు. ఈశాన్య ప్రాంతాలు, తమిళనాడు లాంటి ఒకటిరెండు పెద్ద రాష్ట్రాలు మినహా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు 50శాతం రిజర్వేషన్లే అమలవుతున్నాయి. అంటే ఉన్నత విద్యారంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థుల ఎదుగుదలకు ఆర్థిక పరిస్థితుల్లో వచ్చిన మార్పులే ప్రధాన కారణంగా చెప్పుకోవాలి. 50శాతం రిజర్వేషన్లు పక్కాగా అమలయ్యే ప్రభుత్వ, ఎయిడెడ్ ఉన్నత విద్యాసంస్థలకే ఈ ఎదుగుదల పరిమితం కాలేదు. ప్రభుత్వ సహాయం లభించని ప్రైవేటురంగంలోని విద్యాసంస్థల్లోనూ అది స్పష్టంగా కనపడుతోంది. ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సంఖ్య 62.2 శాతం ఉంటే ప్రైవేటురంగంలో అది 60శాతంగా నమోదైంది. పోనీ ఈ వర్గాల విద్యార్థులు సంప్రదాయక కోర్సులైన బీఏ, ఎంఏ, బీకాం లాంటి వాటికే పరిమితమయితే దాన్ని ఒకరకంగా వెనుకబాటుగానే పరిగణించొచ్చు. కానీ పరిస్థితి అలా లేదు. బీటెక్ (48.2శాతం), బీఈ(60.5శాతం), ఎంటెక్ (63శాతం), ఎంబీఏ (51,2శాతం), ఎంబీబీఎస్ (44.7శాతం), ఎండీ (40శాతం) లాంటి కోర్సుల్లో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థుల ఎదుగుదల స్పష్టంగా కనపడుతోంది. సాంకేతిక, వైద్య, మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరికల సగటు ప్రగతిరేటు ఇతర కోర్సులతో పోల్చితే ఎక్కువగా ఉంటుంది.

## బీమాలో సంపూర్ణ ఎఫ్‌డీఐ




భారత బీమా రంగంలో విదేశీ సంస్థలు పూర్తి స్థాయిలో ప్రవేశించటానికి ఎట్టకేలకు మార్గం సుగమమైంది. ఈ విషయంలో రెండు దశాబ్దాలుగా ఎడతెగకుండా సాగుతున్న ప్రయత్నాలు ఒక కొలిక్కివచ్చాయి. 'సబ్‌కా బీమా సబ్‌కీ రక్షా' పేరిట పార్లమెంటులో రంగప్రవేశం చేయబోతున్న బీమా చట్టాల సవరణ బిల్లు... 1938నాటి బీమా చట్టానికీ, 1956నాటి జీవితబీమా కార్పొరేషన్ చట్టానికీ, 1999 నాటి బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) చట్టానికీ సమూలమైన మార్పుల్ని ప్రతిపాదిస్తోంది. బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను ప్రస్తుతం వున్న 74 శాతం నుంచి 100 శాతానికి పెంచటానికి ఈ బిల్లు అనుమతిస్తోంది. కేంద్రంలో పాలకులెవరైనా, వారి రాజకీయ విశ్వాసాలూ, నాయకత్వం వహిస్తున్న కూటములూ ఏవైనా ఎఫ్‌డీఐను పూర్తి స్థాయిలో అనుమతించాలన్న విషయంలో అందరిదీ ఒకటే స్వరం. బీమా రంగంలో విదేశీ సంస్థలకు తలుపులు బార్లా తెరవాలని సంపన్న దేశాల నుంచి ఎప్పటినుంచో ఒత్తిళ్లు ఉన్నాయి. మన బీమా రంగంలో ప్రైవేటు సంస్థలున్నా సామాన్య పౌరులు పబ్లిక్ రంగ సంస్థ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)ను విశ్వసించిన స్థాయిలో వాటిని నమ్మరు. అందుకే మార్కెట్‌లో ఇప్పటికీ దాని భాగస్వామ్యం దాదాపు 65 శాతం. అలాగని చొరవగా దూసుకెళ్లటంలో అదింకా వెనకబడి వున్నదనీ ఆర్థిక రంగ నిపుణులంటారు. పోటీ పెరిగితే ఇది మారుతుందనీ, వినియోగదారులు లాభపడతారనీ వారి వాదన. మన జీవిత బీమా రంగం వాటా జీడీపీలో 3.2 శాతం. వాస్తవానికి ఇది 2023%-%24 ఆర్థిక సంవత్సరంలో మరింత కిందకు పోయి 2.8 శాతం దగ్గర ఆగింది. విదేశాల్లో ఈ రంగం వాటా 6.5 శాతం. విదేశీ సంస్థలను అనుమతించటాన్ని వ్యతిరేకించేవారు అవి లాభార్జన దృష్టితో ఉంటాయని విమర్శిస్తారు. దేశీయ పొదుపు దేశాభివృద్ధికి కాక విదేశీ సంస్థలకు పోతుందని... పేదరికం ప్రబలంగా ఉన్న మనలాంటి దేశంలో సంక్షోభ కాలంలో ఆసరాగా నిలబడకపోతే ఎలా అన్నది వారి ప్రశ్న. అనుకున్నట్టు లాభాలు రాకపోతే సంస్థలు దివాలా తీసే, నిష్క్రమించే అవకాశం ఉండదా అనే సందేహాలున్నాయి. ఐఆర్‌డీఏఐ వంటి నియంత్రణ సంస్థ ఉండగా ఆ భయాలు అవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది. ప్రస్తుతం డేటా చౌర్యం కూడా సమస్యే! ప్రైవేటు సంస్థల్లో తగిన నియంత్రణ లేని కారణంగా ఖాతాదారుల డేటా బయటకు పోతోందని, అందువల్ల మోసగాళ్ల బెడద ఎక్కువైందని బీమా రంగాన్ని ప్రైవేటీకరించటాన్ని వ్యతిరేకించే సంస్థలు ఆరోపిస్తున్నాయి. 2047కల్లా పౌరుల్లో ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యం చేరాలన్నది ఐఆర్‌డీఏఐ లక్ష్యం. అలాగే ఆరోగ్యం, ఆస్తి తదితరాలకు సైతం బీమా చేయించుకునేలా ప్రచారం చేయాలని ఆ సంస్థ కంకణం కట్టుకుంది. విదేశీ సంస్థల్ని అనుమతించటానికి చాన్నాళ్లుగా మన ప్రభుత్వాలు హైరానా పడుతున్నాయి. తొలిసారి వాజపేయి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 1999లో ఐఆర్‌డీఏఐ చట్టాన్ని తీసుకొచ్చి ఆ రంగంలో 26 శాతం ఎఫ్‌డీఐలకు తొలిసారి అనుమతించింది. ఆ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్, 2004లో తన నేతృత్వంలోని యూపీఏ అధికారంలోకి రాగానే దాన్ని 49 శాతానికి పెంచే ప్రయత్నం చేసింది. అప్పట్లో యూపీఏకు బాసటగా ఉన్న వామపక్షాలు ఆ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయి. కారణం ఏమైతేనేం ఈ ప్రతిపాదన ముందుకు కదల్లేదు. వారితోపాటు విపక్షంలోఉన్న బీజేపీ సైతం గట్టిగా వ్యతిరేకించింది. కేంద్రంలో 2014లో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్డీయే అధికారంలోకొచ్చిన వెంటనే పాత ప్రతిపాదన దుమ్ము దులిపింది. ఏడాదికల్లా దాన్ని 49 శాతానికి, మరో ఏడేళ్లకు 74 శాతానికి విస్తరించింది. బీమా సంస్థల్లో విదేశీ భాగస్వాముల వాటా పరిమితమే గనుక భయాందోళనలు అనవసరమని ఇన్నాళ్లూ ప్రభుత్వాలు చెబుతూవచ్చాయి. ఇప్పుడది 100 శాతానికి చేరింది గనుక తగిన జాగ్రత్తలూ, నియంత్రణలూ అవసరం. బిల్లు పార్లమెంటు పరిశీలనకొచ్చినప్పుడు, అందులోని లోటుపాట్లేమిటో, ఇంకా చేయాల్సిందేమిటో చెప్పగలిగే దిశగా ఆరోగ్యవంతమైన చర్చ జరగాలి. దేశీయ పొదుపు కాస్తా అన్యుల చేతుల్లోపడితే, వారు సక్రమంగా నిర్వహించటంలో విఫలమైతే సామాన్యులకు తీరని నష్టం కలుగుతుంది.

## ప్రగతి భారతానికి సొంత వ్యూహం



ఈ ఏడాది ప్రపంచంలోనే అత్యధిక వృద్ధిరేటు సాధించిన ఇండియా- పారిశ్రామికంగా మరింత పురోగమించేందుకు ఇటీవల 'లేబర్ కోడ్'లను అమలులోకి తెచ్చింది. కానీ, ఆర్థికాభివృద్ధికి కీలకమైన యువ జనాధిక్యతను సద్వినియోగం చేసుకోలేకపోతోంది. దాంతో యువతలో నిరుద్యోగిత పెరుగుతోంది. దాన్ని నివారించాలంటే భారత్ కేవలం వస్తుసేవల వినియోగంపైనే ఆధారపడకూడదు. సొంతంగా టెక్నాలజీని అభివృద్ధి చేసుకుని, ఎగుమతులనూ పెంచుకుంటేనే ఉపాధి అవకాశాలు విరివిగా అందివస్తాయి. కొన్నేళ్లుగా దేశంలోని బడా కంపెనీలు పెట్టుబడులు పెట్టగల సామర్థ్యముండీ కూడా ఆ పని చేయడంలేదు. పైగా ప్రభుత్వం భారీగా సబ్సిడీలు ఇస్తేనే కొత్త పరిశ్రమలు స్థాపిస్తామనీ, ఉన్నవాటిని విస్తరిస్తామనీ అంటున్నాయి. లేదంటే విదేశీ కంపెనీలు పెట్టుబడులు పెడితే వాటికి ఇక్కడ ఏజెంట్లుగా పనిచేయడానికి ఆసక్తి చూపుతున్నాయి. మరికొన్ని కంపెనీలు అరువు తెచ్చుకున్న పాత సాంకేతికతలతో లైసెన్సుల మీద ఉత్పత్తి సాగిస్తున్నాయి. విదేశాల్లో విజయవంతమైన వ్యాపార నమూనాలను ఇక్కడ అనుసరిస్తున్నాయి. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, రోబోటిక్స్ వంటి సృజనాత్మక సాంకేతికతలు రాజ్యమేలుతున్న ప్రపంచంలో అరువు పరిజ్ఞానాలతో పనికాదని అవి గ్రహించడం లేదు. ఇలాంటి ఆర్థిక నమూనాలు దీర్ఘకాలిక ప్రగతికి ఏమాత్రం పనికిరావు. ప్రభుత్వ ప్రోత్సాహక పథకం కింద ఇలాంటి కంపెనీల్లో అప్రెంటిస్‌లుగా చేరినవారు సైతం వీటివల్ల తమకు భవిష్యత్తు ఉండదని గ్రహించి గడువుకన్నా ముందే వైదొలుగుతున్నారు.

### పరిశోధన-అభివృద్ధికి ససేమిరా...

మన కంపెనీలు పెట్టుబడి వ్యయాన్ని పెంచి సృజనాత్మకతకు పదునుపెట్టాలి. కొత్త సాంకేతికతలను సృష్టించి, వాటిపై మేధా హక్కులను సాధించడంతో పాటు అత్యాధునిక ఉత్పత్తులూ సేవలతో ముందుకుసాగాలి. అప్పుడే భారతదేశ దీర్ఘకాలిక ప్రగతికీ, ఉజ్జ్వల భవిష్యత్తుకూ భరోసా లభిస్తుంది. కానీ, ఈ వాస్తవాన్ని మన కార్పొరేట్లు గ్రహించకపోవడం విచారకరం. జాతీయ గణాంక సంస్థ నిర్వహించిన సర్వేలో 40.3శాతం కంపెనీలే 2024-25లో కీలక ఉత్పాదక ఆస్తుల సృష్టికి పెట్టుబడులు పెంచుతామని చెప్పాయి. 2025-26కి వచ్చేసరికి ఈ పెట్టుబడి వ్యయాన్ని తగ్గిస్తామని చెప్పడం వాస్తవ పరిస్థితికి నిదర్శనం. అయితే, పారిశ్రామిక రంగంలోని కొన్ని కంపెనీలు అలా చెప్పకపోవడం కారుచీకట్లో ఆశాకిరణం. సర్వేలో పాల్గొన్న కంపెనీల్లో 28.4శాతం ఉన్న వ్యాపారాన్నే మెరుగుపరచుకోవడానికీ, అదనపు విలువను జోడించడానికీ పెట్టుబడులు పెడతామన్నాయి. పరిశోధన-అభివృద్ధి ద్వారా మేధా హక్కులు సాధించడానికి మదుపు చేస్తామన్న కంపెనీలు కేవలం 5.8శాతమే! ఇక 43శాతం కంపెనీలైతే కొత్త పెట్టుబడులు పెట్టే ఉద్దేశమే లేదనేశాయి. ఇలాంటప్పుడు భారతదేశ జీడీపీలో పరిశోధన-అభివృద్ధి (ఆర్అండ్‌డీ) వాటా కేవలం 0.8శాతంగానే ఉందంటే ఆశ్చర్యమేముంది? గడచిన మూడు దశాబ్దాల నుంచీ ఇదే కథ. 1994-95లో మన జీడీపీలో 19శాతంగా ఉన్న పారిశ్రామిక రంగం వాటా నేడు 12శాతానికి పడిపోయింది! ప్రైవేటు కంపెనీల లాభాలు పెరగడమనేది కార్మికుల ఉత్పాదకశక్తి పెరగడం మీద ఆధారపడి ఉంటుంది. ఉత్పాదకత పెరగడానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి- ఆధునిక యంత్రాలనూ సాంకేతికతలనూ సమకూర్చుకుని, వాటికి అనుగుణంగా కార్మికుల నైపుణ్యాలను మెరుగుపరచి... తక్కువ వ్యయంతో ఎక్కువ ఉత్పత్తిని సాధించడం. కార్మికులతో ఎక్కువ గంటలు పనిచేయించుకుని అధిక ఉత్పత్తిని సాధించడం రెండోది. కొత్త సాంకేతికతల ద్వారా కార్మికుల ఉత్పాదకతనూ, తద్వారా లాభాలనూ పెంచుకోవచ్చు. అయితే, ఇందుకోసం ఆర్అండ్‌డీపై కాస్త ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ పని చేయడానికి చాలా భారతీయ కంపెనీలు ససేమిరా ఇష్టపడటం లేదు సరికదా, కార్మికుల నుంచి ఎక్కువగా పిండుకోవడానికే ప్రాధాన్యమిస్తున్నాయి. అందుకే కార్మికుల పనిగంటలను 8 నుంచి 12 గంటలకు పెంచాలని పట్టుబట్టాయి. వీటిలో తక్కువస్థాయి సాఫ్ట్‌వేర్ ఎగుమతులు చేసే కంపెనీలే ఎక్కువ. దురదృష్టవశాత్తూ వీటి ఒత్తిడి ఫలించింది. ఇది కార్మికుల సంక్షేమానికి చేటు చేస్తోంది. సాధారణంగా కార్మికులకు ప్రతిరోజూ నగరాలు, పట్టణాలకు దూరంగా ఉండే తమ కంపెనీలకు వెళ్లిరావడానికి 2-4 గంటల సమయం పడుతుంది. ఈ లెక్కన రోజుకు 12గంటల పని అంటే, రోజులో 14-16 గంటలు ఉద్యోగానికే సరిపోతాయి. ఇక వారికి విరామం ఎక్కడ? మేధోశ్రమనైనా సరే, ఇలా ఏకబిగిన చేయడమూ సాధ్యం కాదు. మితిమీరిన పని ఆరోగ్యానికి హానికరం కూడా. నిజానికి చాలా పరిశ్రమల్లో ఇప్పటికే ఎనిమిది గంటలకు మించి పనిచేయిస్తున్నా కార్మికశాఖ పట్టించుకోవడం లేదు. కొవిడ్ వచ్చినప్పటి నుంచి సాఫ్ట్‌వేర్ వంటి రంగాల్లో ఉద్యోగులు ఆఫీసుతోపాటు ఇంటి నుంచీ పనిచేయాల్సి వస్తోంది. ఎక్కువ పనిగంటలను డిమాండ్ చేస్తున్న కంపెనీల్లో అత్యధికం ఆధునిక సేవలు అందించేవి కాదు. తక్కువ కార్మిక వ్యయంతో నెట్టుకొస్తున్న ఇలాంటి సంస్థలకు రేపు ఏఐ, రోబోటిక్స్‌తో కాలం చెల్లనుంది. అందుకే దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న తాపత్రయంతో అవి ఎక్కువ పనిగంటల కోసం డిమాండ్ చేస్తున్నాయి.

### సరైన పరిష్కారమేదీ?

ఏఐ, రోబోటిక్స్ యుగంలో టెక్నాలజీ ఎప్పటికప్పుడు మారిపోతుంది. లాభార్జన కష్టమవుతుంది. కాబట్టి, ప్రభుత్వం నుంచి చవగ్గా భూములు, సబ్సిడీలు పొందుతూ పాతతరం పరిశ్రమలను నడిపించడం ఇక ఎన్నాళ్లో కుదరదు. నవీన సాంకేతికతలు, కొత్త ఉత్పత్తి పద్ధతులతోనే వ్యాపారాలు, పరిశ్రమలు ముందుకుసాగుతాయి. 2008 ఆర్థిక సంక్షోభం తరవాత చైనా ప్రభుత్వ మద్దతుతో అక్కడి కంపెనీలు ఏఐ, రోబోటిక్స్, 5జీ, 6జీ సాంకేతికతలపైనా, అధునాతన ఉత్పత్తి ప్రక్రియలపైనా దృష్టి కేంద్రీకరించాయి. ఇప్పుడవి ప్రపంచంలోనే మేటి కంపెనీలుగా ఎదిగాయి. భారతావని సైతం అదే బాటపట్టాలి. నిర్దిష్ట నవీన రంగాల్లో పెట్టుబడులు పెట్టేవారికి మాత్రమే ప్రభుత్వాలు సబ్సిడీలు ఇవ్వాలి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ(ఎంఎస్ఎంఈ)లకు అండదండలివ్వాలి. దేశ పారిశ్రామిక రంగంలో 80శాతం ఇలాంటివే కాబట్టి, వాటి ద్వారా పెద్దయెత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఎంఎస్ఎంఈలు అత్యాధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవడానికీ ప్రభుత్వపరంగా చేయూతనివ్వాలి.

## ట్రంప్ ఆగ్రహాన్ని లెక్కచేయని దోస్తీ..



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్ పర్యటన విశేషమైంది. ఇది ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత పుతిన్ మొట్టమొదటి భారత సందర్శన. ఈ కలయిక రెండు దేశాల మధ్య చరిత్రాత్మక స్నేహాన్ని మరోసారి రుజువు చేసింది. అయితే ఈ సన్నిహితత్వం పశ్చిమ దేశాలకు, ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని అమెరికాకు నచ్చటం లేదు.

### చిరకాల బాంధవ్యం.. చెరగని స్నేహం

భారత్-రష్యా సంబంధాలు ఎప్పుడూ ప్రత్యేకమే. ఈ సమ్మిట్‌లో భారతదేశ అవసరాలకు రక్షణ, ఇంధనం, వాణిజ్యం, పటిష్టతలపై పదహారు కీలక ఒప్పందాలు రష్యాతో కుదుర్చుకొన్నాం. భారత్ ఇప్పటికీ తన రక్షణ ఆయుధాల్లో 60 శాతానికి పైగా రష్యా నుండే కొంటోంది. (ఎస్-400 )వ్యవస్థ తర్వాత మరిన్ని ఆధునిక ఆయుధ ఒప్పందాలు ఖరారయ్యాయి. ఇక ఈ ఒప్పందాల్లో అతి ముఖ్యమైనది ఇంధన రంగం. యుద్ధం తర్వాత భారత్ రష్యా నుండి భారీగా డిస్కౌంట్ ధరకు క్రూడాయిల్‌ను కొనుగోలు చేసింది. 2022లో 10 బిలియన్ డాలర్లున్న వాణిజ్యం 2024-25 నాటికి 68 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రతి బ్యారెల్‌కు సగటున 12 డాలర్ల ఆదా అవుతోంది. పుతిన్ 'భారతదేశ అవసరాలకు సరిపడా ఆంక్షలు లేని ఇంధనం సరఫరా'కు హామీ ఇచ్చారు. రెండు దేశాలూ 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల వాణిజ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాయి.

### భారత్-రష్యా... డీ-డాలరేజేషన్ బంధం

డాలర్‌ను దాటవేసి రూపాయి-రూబుల్ లావాదేవీలు, రష్యన్ బ్యాంకులు భారత స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు. ఇవన్నీ డీ-డాలరైజేషన్ దిశగా వేగంగా వేస్తున్న చిన్న అడుగులు.. గ్లోబలైజేషన్ నియమాల ప్రకారం ఎవరు ఎవరితోనైనా అంతర్జాతీయ మార్కెట్లో ఎగుమతులు, దిగుమతులు వాళ్ల దేశ అవసరాలకు అనుగుణంగా స్వేచ్ఛగా చేసుకోవచ్చు. ఇప్పుడు భారత్‌కు రష్యా ఇచ్చే ధరకు ఏ దేశం క్రూడాయిల్ సరఫరా చేసినా కొనుగోలుకు భారత్ సిద్ధంగా ఉంది. కానీ, రష్యాతో ఈ సన్నిహితత్వం అమెరికాకు కంటగింపుగా మారింది. కానీ భారత్ తన జాతీయ ప్రయోజనాలకు అడ్డు రాకుండా స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కొనసాగిస్తోంది.

### రష్యా చమురు కొనుగోలు ఆగదు..

ట్రంప్ తన దేశాన్ని బలోపేతం చేసుకోవటం తప్పు కానప్పుడు... అదే మార్గంలో భారత్ అనుసరిస్తే తప్పేముంది? భారత్ రష్యా నుండి ఆయిల్ కొనుగోళ్లను పూర్తిగా ఆపే అవకాశం ఏమాత్రం లేదు. ఎందుకంటే ఇంధన భద్రత, దేశంలో ధరల స్థిరత్వం కీలకం. అమెరికా నుండి కొంత ఆయిల్ కొంటూ రష్యాతోనూ సంబంధాలు కాపాడుకుంటుంది. రక్షణ ఒప్పందాలు కూడా కొనసాగుతాయి. ఎందుకంటే భారత సైన్యానికి రష్యన్ ఆయుధాల స్పేర్ పార్ట్స్, సాంకేతికత అత్యవసరం. అమెరికాతో క్వాడ్, ఐ2, యూ2 వంటి వేదికల ద్వారా సహకారం పెరుగుతూనే ఉంటుంది. రష్యా-చైనా దోస్తీ భారత్‌కు పూర్తిగా వ్యతిరేకం కాదు. బదులుగా రష్యా ఒక బ్యాలెన్సింగ్ శక్తిగా పనిచేస్తుంది.

### నూతన భారత్ తలవంచదు..

అంతిమంగా పుతిన్ ఢిల్లీ సందర్శన ఒక స్పష్టమైన సందేశం ఇచ్చింది. భారత్ ఎవరి ఒత్తిడికీ లొంగని స్వతంత్ర శక్తిగా ఎదుగుతోంది. గ్లోబల్ ఆర్డర్ మారుతోంది. బ్రిక్స్, షాంఘై కో-ఆపరేషన్ వంటి వేదికల్లో భారత్-రష్యా భాగస్వామ్యం మరింత బలపడనుంది. ఈ దోస్తీ భారత్ జాతీయ ప్రయోజ నాలకు అనుకూలంగా ఉంటూనే, ప్రపంచ రాజకీయాల్లో దాని స్వరాన్ని మరింత బలంగా వినిపిస్తుంది. ట్రంప్ గానీ, యూరప్ గానీ, ఈ కొత్త భారత్‌ను గౌరవించక తప్పదు. ఒక దేశం మెరమెచ్చుల కోసం మన విధానాలు మారవు.

## కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు,
# ఉద్యోగ భద్రత కల్పించాలి...
### సోలార్ ప్లాంట్ వద్ద కాంట్రాక్ట్ కార్మికుల నిరసన....




రామగిరి.**ఆకాంక్ష డిసెంబర్ 16:** ఆర్జీ 3 ప్రాంతంలో ఉన్న 50 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ పవర్ ప్లాంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం గేట్ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆర్జీ3 ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది.యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఉడుత శంకర్ యాదవ్, జనరల్ సెక్రటరీ బండ కిరణ్ రెడ్డి నాయకత్వంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పని గంటల నియంత్రణ, ఈఎస్ఐ పీఎఫ్ వంటి చట్టబద్ధ హక్కులు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే కార్మికులపై యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యాజమాన్యం కార్మిక సంఘంతో చర్చలు జరిపి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగగా, సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని కార్మికులు విజ్ఞప్తి చేశారు.

## సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో
# ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం...

గోదావరిఖని.**ఆకాంక్ష డిసెంబర్ 16:** పెద్దపల్లి జిల్లా రామగుండం ప్రాంతంలోని ఆర్జీ 1 పరిధిలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాదుకు చెందిన మాత రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ ఆయుర్వేద నిపుణులు డా. శ్రీ విశ్వనాథ మహర్షి ఈ శిబిరంలో వైద్య సేవలు అందించనున్నారని పేర్కొన్నారు. ఈ ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం డిసెంబర్ 19, 2025న ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు ఆర్.సి.ఓ. ఏ క్లబ్‌లో నిర్వహించబడుతుందని తెలిపారు.ఈ శిబిరంలో ఆయుర్వేద స్పెషలిస్టు డా. శ్రీ విశ్వనాథ మహర్షి వివిధ రకాల అనారోగ్య సమస్యలకు ఉచిత వైద్య సలహాలు అందించనున్నారు. ముఖ్యంగా చర్మవ్యాధులు, మోకాళ్ల నొప్పులు, గుండె దడ, రక్తపోటు (బీపీ), షుగర్, థైరాయిడ్ సమస్యలు, మలబద్ధకం, అజీర్ణం, పక్షవాతం, అస్తమా వంటి వ్యాధులతో పాటు మహిళలకు సంబంధించిన అనేక ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేద చికిత్సలపై మార్గనిర్దేశం చేయనున్నారు. వైద్య పరీక్షలు మరియు సలహాలు పూర్తిగా ఉచితంగా అందించబడతాయని, అయితే మందులకు మాత్రమే నామమాత్రపు రుసుము వసూలు చేయనున్నట్లు నిర్వాహకులు స్పష్టం చేశారు.ఈ ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, సింగరేణి ప్రభావిత ప్రాంతాల ప్రజలు మరియు పారిశ్రామిక ప్రాంతాల్లో నివసించే ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాలకు డా. శ్రీ విశ్వనాథ మహర్షి, ఆయుర్వేద స్పెషలిస్టు సెల్ నంబర్ 9849574706 ను సంప్రదించాలని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ శిబిరానికి విశేష స్పందన లభించాలని సింగరేణి సేవా సమితి ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## చెత్త వేర్పాటుపై ఇంటింటికీ
# అవగాహన రంగంలోకి మహిళా ఆర్పీలు...
### సిరిసిల్ల పట్టణ పరిశుభ్రత కోసం మున్సిపాలిటీ వినూత్న చర్యలు..
### తడి పొడి చెత్త వేరు చేయాలంటూ ప్రజలకు సూచనలు...

సిరిసిల్ల.**ఆకాంక్ష డిసెంబర్ 16:** పట్టణ పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగు పరిచే దిశగా సిరిసిల్ల మున్సిపాలిటీ అధికారులు వినూత్న చర్యలకు శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణను పటిష్టం చేయాలనే లక్ష్యంతో మహిళా రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీలు)ను రంగంలోకి దింపి అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు.సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డు కేంద్రంగా ఈ కార్యక్రమానికి ఆరంభం కాగా,ఉదయం వేళల్లోనే మహిళా ఆర్పీలు డ్యూటీలోకి చేరి పారిశుద్ధ్య పర్యవేక్షణలో చురుగ్గా పాల్గొంటున్నారు. చెత్త బండితో పాటు వార్డులలో తిరుగుతూ ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా వేయాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. ప్రస్తుతం అనేక వార్డుల్లో తడి చెత్త, పొడి చెత్తను ఒకే బుట్టలో కలిపి చెత్త బండిలో వేస్తున్న పరిస్థితి ఉందని మున్సిపల్ అధికారులు గుర్తించారు. దీనివల్ల వ్యర్థాల వేర్పాటు ప్రక్రియకు తీవ్ర ఆటంకం కలుగుతుండటంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణలో సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితిని మార్చాలనే ఉద్దేశంతో మహిళా ఆర్పీల ద్వారా అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేశారు. మహిళా ఆర్పీలు ప్రతి ఇంటి వద్ద ఆగి తడి చెత్తలోకి వచ్చే ఆహార వ్యర్థాలు, కూరగాయల తొక్కలు, ఆకులు తదితరాలను ప్రత్యేక బుట్టలో వేయాలని, అలాగే ప్లాస్టిక్, కాగితం, గాజు వంటి పొడి చెత్తను వేరు బుట్టలో సేకరించాలని ప్రజలకు స్పష్టంగా వివరిస్తున్నారు. చెత్త వేర్పాటు జరిగితే పునర్వినియోగం, శుద్ధి ప్రక్రియలు సులభమవుతాయని, పట్టణం పరిశుభ్రంగా ఉండటానికి ఇది దోహదపడుతుందని అవగాహన కల్పిస్తున్నారు.ఈ కార్యక్రమం ద్వారా సిరిసిల్ల పట్టణాన్ని మరింత శుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచేందుకు మున్సిపాలిటీ కృషి చేస్తోందని అధికారులు తెలిపారు. పట్టణ పరిశుభ్రత బాధ్యత కేవలం మున్సిపాలిటీదే కాకుండా ప్రజలందరిదీ అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ చెత్త వేర్పాటులో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో మున్సిపల్ సిబ్బంది, మహిళా ఆర్పీలు సమన్వయంతో పాల్గొంటూ ప్రజల్లో మంచి స్పందన తీసుకొస్తున్నారు.

## పంచాయతీ ఎన్నికల వేళ
# కొర్కాసులతో పరస్పర దాడులు..
### చెన్నారావుపేటలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చలిమంట ఘర్షణ...
### కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు...



వరంగల్.**ఆకాంక్ష డిసెంబర్ 16:** పంచాయతీ ఎన్నికల వేళ రాష్ట్ర వ్యాప్తంగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వరంగల్ జిల్లాలో మరో ఉద్రిక్త సంఘటన వెలుగులోకి వచ్చింది. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం చెరువుకొమ్ము తండాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. అర్ధరాత్రి సమయంలో చలిమంట వేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల వద్దకు అటుగా వెళ్లిన బీఆర్ఎస్ కార్యకర్తలు ఎదురవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.ఇరుపార్టీల కార్యకర్తలు ఎదురెదురుగా రావడంతో "మేమే గెలుస్తాం" అంటూ పరస్పరం సవాళ్లు విసురుకున్నారు. మాటామాటా పెరిగి ఉద్రిక్తత తారస్థాయికి చేరడంతో చివరకు ఘర్షణకు దారి తీసింది. ఎన్నికల పోటీ వాతావరణంలో రాజకీయ ఉద్రేకం పెరగడంతో ఇరువర్గాల కార్యకర్తలు చలిమంట వేసుకున్న కొర్కాసులనే ఆయుధాలుగా ఉపయోగించి ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. క్షణాల్లోనే గ్రామంలో కలకలం రేగి భయానక వాతావరణం నెలకొంది.ఈ ఘర్షణలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని గ్రామస్తులు వెంటనే నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. ఘటన వార్త గ్రామమంతా వ్యాపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే చెరువుకొమ్ము తండాకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇరుపార్టీల కార్యకర్తలపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గ్రామంలో మళ్లీ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. అదనపు పోలీసు బలగాలను మోహరించి గ్రామంలో శాంతిభద్రతలు పర్యవేక్షిస్తున్నారు.పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల మధ్య ఉద్రిక్తతలు పెరిగి హింసాత్మక ఘటనలకు దారి తీస్తుండటం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరగాల్సిన వేళ ఇలాంటి ఘర్షణలు జరగడం దురదృష్టకరమని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.ం

# ఎన్నికల వేళ కన్నీళ్లు... అధికారంలో కూల్చివేతలు...

### రామగుండంలో కమిషన్ల కోసమే సుందరికరణ పనులు...
### వ్యాపారులను రోడ్డుమీద పడేసిన
### రాజ్ ఠాకూర్ రామగుండం పాలన...
### రెండేళ్ల ఎమ్మెల్యే పాలనలో సామాన్యులకు ఒరిగిందేమీ లేదు..
### బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్..




గోదావరిఖని **ఆకాంక్ష డిసెంబర్ 16:** రామగుండం నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ పాలనపై బీఆర్ఎస్ ఛార్జిషీట్ విడుదల చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేవలం కూల్చివేతలు మాత్రమే చేస్తున్నారని వ్యాపారులను రోడ్డున పడేస్తున్నారని రామగుండం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ విమర్శించారు.ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రామగుండంలో పరిపాలన పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, ప్రజాప్రతినిధిగా ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు. రెండు సంవత్సరాలుగా అధికార యంత్రాంగంపై నియంత్రణ లేక పోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని,కూల్చివేతల పేరుతో వ్యాపారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కటైనా నెరవేర్చకుండా, అభివృద్ధి పేరుతో కూల్చివేతలు చేస్తూ ప్రజలను,చిరు వ్యాపారులను వేధిస్తున్నారని విమర్శించారు.కూల్చివేతల వల్ల నష్టపోయిన ప్రజలకు, వ్యాపారులకు ఇప్పటి వరకు ఎటువంటి నష్టపరిహారం చెల్లించలేదని, రామగుండం సుందరికరణ పేరుతో కమిషన్ల కోసమే పనులు చేపట్టి, అవే పనులను మళ్లీ మళ్లీ చేస్తున్నారని కోరుకంటి చందర్ ఆరోపించారు. ఎమ్మెల్యేగా గెలిచిన రెండేళ్లు పూర్తయినా సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో రెండు సార్లు ఓడిపోయానని కన్నీళ్లు పెట్టుకొని ఓట్లు అడిగి గెలిచిన మక్కన్‌సింగ్, ఈ రెండేళ్లలో అనేక మందిని ఏడిపించాడని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులు, అప్పట్లో చేసిన అభివృద్ధి పనులను తనవిగా చెప్పుకుంటూ కొబ్బరికాయలు కొట్టి గొప్పలు చెప్పుకోవడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. పరిపాలన అస్తవ్యస్తానికి నిదర్శనంగా ఇప్పటికీ మైసమ్మ గుళ్లను కూల్చిన వారిపై ఎలాంటి చర్యలు లేకపోవడాన్ని ప్రస్తావించారు. కూల్చివేసి మళ్లీ కట్టుకోమని చెప్పి అభివృద్ధి జపం చేయడం ద్వంద్వ వైఖరేనని విమర్శించారు. అంతర్గాం మండలంలో రూ.80 కోట్లతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరై పూర్తి చేసిన లిఫ్ట్ పనులకు ఇప్పుడు కొబ్బరికాయలు కొట్టి మేమే తెచ్చామని చెప్పుకోవడం హాస్యాస్పదమని అన్నారు.పాత మున్సిపల్ కార్యాలయంలో చేపట్టిన పార్కింగ్ కాంప్లెక్స్ పనులు రెండేళ్లు గడిచినా ఇప్పటికీ పూర్తి కాలేదని, ఎన్టీఆర్ నగర్ లో ఇంటిగ్రేటెడ్ వెజిటబుల్ మార్కెట్, విఠల్ నగర్ లో నాన్‌వెజ్ మార్కెట్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని తెలిపారు. ఎన్టీపీసీలో కూల్చివేసిన చిరు వ్యాపారులకు ఇప్పటికీ న్యాయం జరగలేదని, గాంధీ మార్కెట్ కూల్చివేతతో జీవనాధారం కోల్పోయిన వారికి భరోసా కల్పించలేదని విమర్శించారు.ఓల్డ్ అశోక్ ప్రాంతంలోనూ చిరువ్యాపారులకు న్యాయం చేయలేదని, లక్ష్మీనగర్‌లో రోడ్డు వెడల్పు పేరిట మొదట మూడు ఫీట్లు, తర్వాత ఐదు ఫీట్లు అంటూ వ్యాపారులను రోడ్డుమీద పడేశారని తెలిపారు. రెండేళ్లుగా లక్ష్మీనగర్‌లో వ్యాపారాలు నిలిచిపోవడంతో ప్రజలు మంచిర్యాలకు వెళ్లి కొనుగోళ్లు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. ఇది మక్కన్‌సింగ్ అవగాహన లేని పాలనకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుద్ధ్య నిర్వహణ కూడా పూర్తిగా అస్తవ్యస్తంగా ఉందని, మొత్తంగా ఎమ్మెల్యే రెండేళ్ల పాలన ప్రజలకు నిరాశ, అవస్థలే మిగిల్చిందని కోరుకంటి చందర్ విమర్శించారు.ఈ కార్యక్రమంలో నూతి తిరుపతి. మూల విజయరెడ్డి. జనగామ కవిత సరోజినీ. నామతాబాద్ కిరణ్ జీ. తదితరులు పాల్గొన్నారు.

# కోడలి గెలుపు కోసం మామ క్షుద్రపూజలు...
### సర్పంచ్ ఎన్నికల వేళ ప్రత్యర్థి అభ్యర్థి భర్తకు గుండెపోటు...



నారాయణపేట.**ఆకాంక్ష డిసెంబర్ 16:** నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కాచువార్ గ్రామంలో చోటుచేసుకున్న ఓ విచిత్రమైన ఘటన గ్రామాన్ని ఒక్కసారిగా భయాందోళనకు గురిచేసింది. గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో తన కోడలు గెలవాలనే ఆశతో ఓ మామ క్షుద్రపూజలు చేయించాడని గ్రామస్తుల ముందు స్వయంగా ఒప్పుకోవడం కలకలం రేపింది. ఈ సంఘటనతో పాటు ప్రత్యర్థి అభ్యర్థి భర్తకు అకస్మాత్తుగా గుండెపోటు రావడం మరింత ఉత్కంఠను పెంచింది. గ్రామ సమాచారం ప్రకారం సర్పంచ్ ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరుకున్న సమయంలో కోడలి విజయాన్ని ఖాయం చేయాలనే ఉద్దేశంతో ఆ మామ క్షుద్ర మాంత్రికుడిని ఆశ్రయించి ప్రత్యేక పూజలు చేయించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఇంట్లోని కుటుంబ సభ్యులకు కూడా తెలియకుండా రహస్యంగా నిర్వహించినట్లు అతడే గ్రామస్తుల సమక్షంలో అంగీకరించాడు. ఈ మాటలు బయటకు రావడంతో గ్రామంలో ఒక్కసారిగా చర్చ మొదలైంది. ఈ పరిణామాల మధ్య, అదే సమయంలో కోడలికి ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న అభ్యర్థి భర్తకు తీవ్ర గుండె నొప్పి రావడంతో మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అతడిని మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. ఈ ఘటనకు క్షుద్రపూజలే కారణమా అనే అనుమానాలు గ్రామంలో వ్యాపించాయి. ఈ సంఘటనతో కాచువార్ గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఆ కుటుంబం నివసించే ఇంటి వైపు వెళ్లాలంటేనే వణుకుతున్నామని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు గ్రామ పెద్దలు గ్రామంలో అపోహలు పెరగకుండా చూడాలని ప్రయత్నిస్తున్నా, జరిగిన పరిణామాలు ప్రజల మనసుల్లో అనుమానాలను మరింత బలపరిచినట్లుగా తెలుస్తోంది. మొత్తానికి, కోడలి గెలుపు కోసం మామ చేసిన ఈ చర్యలు నిజంగా ఫలిస్తాయా? ఎన్నికల ఫలితం ఏమవుతుందన్నది రేపు సాయంత్రం వెలువడే ఫలితాలతో తేలనుంది. అప్పటివరకు కాచువార్ గ్రామం ఉత్కంఠతో ఎదురుచూస్తోంది.

## అనారోగ్యంతో బాధపడుతున్న
# అనూషను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే...



నల్గొండ.ఆకాంక్ష డిసెంబర్ 16: నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గం వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన కట్టా అనూష గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి స్థానిక నేతల ద్వారా సమాచారం అందుకున్న మిర్యాలగూడ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు నిమ్స్ ఆసుపత్రికి చేరుకుని అనూషను పరామర్శించారు. వైద్యులను ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వివరంగా అడిగి తెలుసుకున్న భాస్కర్ రావు, అనూష త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అవసరమైన సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. భాస్కర్ రావుతో పాటు కట్టా మల్లేష్ గౌడ్, మజ్జిగపు సుధాకర్ రెడ్డి, గౌరు శ్రీనివాస్, కట్టా విక్రం తదితరులు పాల్గొన్నారు.

## సిర్పూర్ (యూ) అడవుల్లో
# 16 మంది మావోయిస్టుల అరెస్ట్...??



ఆసిఫాబాద్.**ఆకాంక్ష డిసెంబర్ 16:** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మావోయిస్టు కార్యకలాపాలపై పోలీసులు భారీ విజయం సాధించారు. సిర్పూర్ (యూ) మండల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో నిర్వహించిన ప్రత్యేక కూంబింగ్ ఆపరేషన్‌లో మొత్తం 16 మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం రాత్రి ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లో ఈ ఆపరేషన్ చేపట్టగా, పోలీసులకు మావోయిస్టుల బృందం తారసపడింది.ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టుల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించడంతో సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టులు తమ స్థావరాలను మారుస్తున్నారని నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ నేపథ్యంలో పోలీస్ నిఘా విభాగానికి వచ్చిన ఖచ్చితమైన సమాచారం మేరకు ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ నేతృత్వంలో స్పెషల్ పార్టీ పోలీసులు సిర్పూర్ (యూ) అడవుల్లో

# మధ్యగేటు వద్ద ఆర్వోబీకి గ్రీన్ సిగ్నల్....
### భూసేకరణ పూర్తయితే వెంటనే పనులు ప్రారంభం...
### దక్షిణ మధ్య రైల్వే జీఎం స్పష్టం....



ఖమ్మం, **ఆకాంక్ష డిసెంబర్ 16:** ఖమ్మం నగరంలోని రెండు ప్రధాన వ్యాపార కేంద్రాలు గాంధీ చౌక్, కమాన్ బజార్‌లను అనుసంధానించే మధ్యగేటు వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అవసరమైన భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసి రైల్వే శాఖకు అప్పగిస్తే, వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీ వాస్తవ స్పష్టం చేశారు.ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల వినతితో మధ్యగేటు వద్ద ఆర్వోబీ నిర్మాణం కోసం రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర గత నెలలో రైల్వే జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు స్పందించిన రైల్వే జీఎం ఎంపీకి లేఖ రాస్తూ కీలక వివరాలు వెల్లడించారు.ఖమ్మం పందిళ్లపల్లి మధ్య 104వ లెవల్ క్రాసింగ్ వద్ద ఆర్వోబీని పూర్తిగా కేంద్ర నిధులతో నిర్మించేందుకు రైల్వే శాఖ సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. అయితే ఆర్వోబీ నిర్మాణం భూసేకరణ అంశంతో ముడిపడి ఉన్నందున, సంబంధిత ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేసి రైల్వే శాఖకు అప్పగించాల్సి ఉందని జీఎం స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదన ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు పేర్కొంటూ, ప్రభుత్వం నుంచి అనుమతి అందగానే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తన లేఖలో ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు తెలియజేశారు. మధ్యగేటు వద్ద ఆర్వోబీ నిర్మాణం జరిగితే నగరంలో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని, వ్యాపార ప్రాంతాలకు రాకపోకలు సులభతరం అవుతాయని నగరవాసులు, వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం నగర అభివృద్ధిలో ఈ బ్రిడ్జి కీలక మైలురాయిగా నిలుస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## సీనియర్ ఉపాధ్యాయులకు
# టెట్ మినహాయింపు కల్పించాలి...
### కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు తపస్ ఉపాధ్యాయ సంఘం వినతి...



మెదక్,**ఆకాంక్ష డిసెంబర్ 16:** ఉపాధ్యాయ సంఘం తపస్ ఆధ్వర్యంలో మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు చెందిన ఉపాధ్యాయుల ప్రాతినిధ్యంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి ఉపశమనం కల్పించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ భేటీలో మెదక్ పార్లమెంటు సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ప్రత్యేకంగా పాల్గొని ఉపాధ్యాయుల సమస్యలను కేంద్ర మంత్రికి వివరించారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు ఇప్పటికే అనేక విద్యా సంస్కరణల్లో కీలక పాత్ర పోషించారని, వారి అనుభవం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని ప్రతినిధులు పేర్కొన్నారు. అలాంటి ఉపాధ్యాయులను మరోసారి టెట్ పరీక్షకు హాజరుకావాలని ఆదేశించడం అనవసరమైన మానసిక ఒత్తిడికి గురిచేస్తోందని, ఇది న్యాయసమ్మతం కాదని స్పష్టం చేశారు.ప్రస్తుత నిబంధనల వల్ల సీనియర్ ఉపాధ్యాయులు పదోన్నతులు, ఉద్యోగ భద్రత అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తపస్ నాయకులు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే సేవలో ఉన్న అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వడం ద్వారా విద్యా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని వారు అభిప్రాయపడ్డారు. మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. సీనియర్ ఉపాధ్యాయుల పట్ల న్యాయం చేయడం అవసరమని, వారి అనుభవాన్ని గౌరవిస్తూ విధానపరమైన సడలింపులు కల్పించాలని సూచించారు.కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధుల వినతిని శ్రద్ధగా విని, అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునే దిశగా కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తుందనే ఆశాభావాన్ని ప్రతినిధులు వ్యక్తం చేశారు.

# ఢిల్లీలో ఇక ఆక్స్ లే ప్యూరిఫైడ్ వాటర్...



న్యూఢిల్లీ **ఆకాంక్ష డిసెంబర్ 16:** హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రంలో అత్యంత పేరు గాంచిన ఆక్స్ లే ప్యూరిఫైడ్ వాటర్ కంపెనీ ఇప్పుడు ఢిల్లీలో కూడా తన అమ్మకాలను ప్రారంభించబోతుంది. సుమారు 13 సంవత్సరాలుగా తెలంగాణలోని ప్రముఖ నగరాలు, పట్టణాల్లో "అక్స్ లే" తన అమ్మకాలను చేస్తుంది. ఇక తాజాగా ఢిల్లీలో కూడా ఆక్వా ఫీన్ కంపెనీ ఆధ్వర్యంలో తయారు అయ్యే "అక్స్ లే" వాటర్ బాటిల్స్ ను విక్రయించేందుకు ఢిల్లీకి చెందిన ఫ్యూచర్ ఇండియా బివరేజెస్ కంపెనీతో ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ఆక్వా ఫీన్ కంపెనీ ఎం.డి ఎన్.వి.రావు, ఫ్యూచర్ ఇండియా బివరేజెస్ కంపెనీ ఎం.డి మనిదీప్ సింగ్ ల మధ్య మంగళవారం ఢిల్లీలో జరిగింది. దీనితో తెలంగాణలో అత్యంత ప్రాచుర్యం పొందిన సంస్థ అక్స్ లే వాటర్ ఇక నుంచి ఢిల్లీ నగర వీధుల్లో కూడా ప్రజలు అందుబాటులో ఉండనుందని అక్స్ లే కంపెనీ ఎం.డి ఎన్.వి రావు తెలిపారు. తన వ్యాపార విస్తరణలో భాగంగా ఆక్వా ఫీన్ కంపెనీ ఎం.డి ఎన్.వి రావు ఢిల్లీకి వెళ్లి ఈ ఒప్పందాన్ని చేసుకున్నారు

## వీటితో షుగర్ ను గణనీయంగా అదుపు చేయవచ్చు..

### షుగర్ ఉన్నవారు పాటించాల్సిన చిట్కాలు ఇవి..




హైదరాబాద్ **ఆకాంక్ష డిసెంబర్ 16 :** షుగర్ ఉన్నవారు పాటించాల్సిన చిట్కాలు ఇవి.. వీటితో షుగర్ ను గణనీయంగా అదుపు చేయవచ్చు. డయాబెటిస్.. నేడు ప్రపంచ వ్యాప్తంగా అధిక శాతం మందిని భయపెడుతున్న జబ్బు ఇది. దీని కారణంగా మన దేశంలో ఏటా కొన్ని కోట్ల మంది కొత్తగా షుగర్ వ్యాధి ప్రపంచంలో అడుగు పెడుతున్నారు. డయాబెటిస్ నేడు ప్రపంచ వ్యాప్తంగా అధిక శాతం మందిని భయపెడుతున్న జబ్బు ఇది. దీని కారణంగా మన దేశంలో ఏటా కొన్ని కోట్ల మంది కొత్తగా షుగర్ వ్యాధి ప్రపంచంలో అడుగు పెడుతున్నారు. టైప్-1, టైప్-2 ఏదైనా రెండింటి వల్ల రక్తంలో ఉన్న షుగర్ స్థాయిలు పెరుగుతాయి. అయితే ఈ రెండింటికీ ట్రీట్‌మెంట్లు కొద్దిగా వేరేగా ఉంటాయి. టైప్-1 కు ఇంజెక్షన్లు ఇస్తే, టైప్-2కు టాబ్లెట్లు ఇస్తారు. ఈ క్రమంలో ఏ తరహా షుగర్ వ్యాధి వచ్చినా దానికి వైద్యులు ఇచ్చే మందులతోపాటు పలు సూచనలు పాటిస్తే దాంతో షుగర్ గణనీయంగా అదుపులోకి వస్తుంది. షుగర్ లెవల్స్ అధికంగా ఉన్నవారు డాక్టర్లు ఇచ్చే మందులను వాడడంతోపాటు పలు సూచనలు పాటిస్తే షుగర్ ను ఎల్లప్పుడూ నియంత్రణలో ఉంచుకోవచ్చు. దీని వల్ల డయాబెటిస్ ఇబ్బంది పెట్టదు.

**దాల్చిన చెక్క, వెల్లుల్లి..**

దాల్చిన చెక్కకు రక్తంలోని చక్కెరను అదుపు చేసే గుణం ఉంది. ఇందులో ఇన్సులిన్ తరహా ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తాయి. అయితే దాల్చిన చెక్కను ఎలా వాడాలంటే.. దీనికి చెందిన పొడిని 3 టేబుల్ స్పూన్ల మోతాదులో తీసుకుని ఒక లీటర్ నీటిలో వేసి మరిగించాలి. 20 నిమిషాల పాటు ఆ నీరు బాగా మరిగాక వచ్చే ద్రవాన్ని వడకట్టి రోజూ ఉదయం, సాయంత్రం భోజనానికి అరగంట ముందు తాగాలి. దీంతో కేవలం కొద్ది రోజుల్లోనే షుగర్ వ్యాధి అదుపులోకి వస్తుంది. అలాగే వెల్లుల్లిలో అలియం సాటివం అనే ఓ రకమైన రసాయనం సమృద్ధిగా ఉంటుంది. ఇది టైప్-2 డయాబెటిస్ వ్యాధిగ్రస్తులకు మంచిది. ఇది వారి రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను అదుపు చేస్తుంది. నిత్యం ఉదయాన్నే పరగడుపున రెండు వెల్లుల్లి రెబ్బల్ని అలాగే పచ్చిగా తింటుంటే దాంతో షుగర్ వ్యాధి నియంత్రణలో ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

**కరివేపాకులు, జామ ఆకులు..**


రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గించే గుణాలు కరివేపాకులోనూ ఉన్నాయి. వీటిలోని ఔషధ కారకాలు డయాబెటిస్‌ను అదుపు చేస్తాయి. నిత్యం ఉదయం, సాయంత్రం భోజనానికి అరగంట ముందుగా గుప్పెడు కరివేపాకు ఆకులను తింటుంటే దాంతో చక్కెర వ్యాధి నయం అవుతుంది. అదేవిధంగా జామ ఆకులు కొన్నింటిని తీసుకుని నీడలో ఎండబెట్టి పొడి చేసుకోవాలి. దీనికి 3 గ్రాముల జీలకర్ర పొడి కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక గ్లాస్ నీటిలో కలిపి ఆ నీటిని మరిగించాలి. అనంతరం ఆ నీరు అరగ్లాస్ అయ్యాక స్టవ్ ఆర్పి ద్రవాన్ని వడకట్టి తాగేయాలి. ఇలా చేస్తే షుగర్ వెంటనే అదుపులోకి వస్తుంది. అలాగే ఉదయాన్నే పరగడుపున 8 గ్లాసుల నీటిని తాగి గంట పాటు వాకింగ్ చేయాలి. ఇలా చేసినా షుగర్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు.

**ఇతర చిట్కాలు..**

ఇక బీట్‌రూట్ దుంప, మెంతి ఆకు లేదా మెంతుల పొడి, కలబంద, వేప, తులసి వంటి మొక్కల ఆకులను ఉదయం, సాయంత్రం తింటున్నా షుగర్ వ్యాధిని అదుపులోకి తేవచ్చు. అలాగే పొడపత్రి ఆకు చూర్ణం నిత్యం ఉదయం, సాయంత్రం భోజనానికి అర గంట ముందు నీళ్లలో కలిపి తాగాలి. దీని వల్ల కూడా షుగర్ గణనీయంగా అదుపులోకి వస్తుంది. ఇలా ఆయా చిట్కాలు, సూచనలను పాటిస్తుంటే షుగర్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. డయాబెటిస్‌ను అదుపు చేయవచ్చు. ఆరోగ్యంగా జీవించవచ్చు.

## తెలంగాణ టెట్ 2026 పరీక్షల షెడ్యూల్ విడుదల...

### జనవరి 3వ తేదీ నుంచి జనవరి 20వ తేదీ వరకు పరీక్షలు...




హైదరాబాద్.**ఆకాంక్ష డిసెంబర్ 16 :** తెలంగాణ టెట్ 2026 పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. జనవరి 3వ తేదీ నుంచి జనవరి 20వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. సీబీటీ విధానం ద్వారా ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు.మొత్తం 9 రోజుల్లో 15 సెషన్లలో ఈ పరీక్షలు జరగనున్నాయి. అభ్యర్థులు ఎక్కువగా ఉండటంతో ప్రతిరోజూ రెండు సెషన్ల చొప్పున పరీక్షలు నిర్వహించనున్నారు.మొదటి సెషన్ ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఆన్‌లైన్‌లో జరిగే ఈ పరీక్షలకు అభ్యర్థులు ముందుగానే హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్షా కేంద్రాలకు సరైన సమయానికి చేరుకోవాలని అధికారులు సూచించారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అధికార మదం తలకెక్కింది...

### బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్...



హైదరాబాద్.**ఆకాంక్ష డిసెంబర్ 16 :** కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అధికార మదం తలకెక్కిందని.. చంపేస్తాం అంటూ బెదిరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. సర్పంచులకు నిధులు ఎమ్మెల్యేల దయాదాక్షిణ్యాలు కాదు.. రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఆయన స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వక పోవడానికి ఎమ్మెల్యేలు ఎవరు? అవి వాళ్ళ ఇంటి సొత్తు కాదు.. వాళ్ళు ఏమన్నా సొంత ఆస్తులు అమ్మి కడుతున్నారా అని ప్రశ్నించారు.ఖానాపూర్ నియోజకవర్గంలో ఇటీవల గెలిచిన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సత్కరించారు. స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన పలువురు సర్పంచ్‌లకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సొమ్ములు కాంగ్రెస్ ఎమ్మెల్యేల అబ్బ సొత్తు కాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసి రిజర్వేషన్‌లను 17 శాతానికి తగ్గించిందని అన్నారు. కేంద్రం నుంచి వచ్చే రూ. 3,500 కోట్ల నిధుల కోసమే కాంగ్రెస్ హడావిడిగా ఎన్నికలు పెట్టిందని తెలిపారు. ఫైనాన్స్ కమిషన్ నిధుల్లో 70 శాతం నేరుగా గ్రామ పంచాయతీలకే వస్తాయని తెలిపారు. వాటిని ఆపే హక్కు, అధికారం ఎవరికీ లేదని స్పష్టం చేశారు. ఖానాపూర్ గడ్డపై ఎగిరేది గులాబీ జెండానే అని తెలిపారు.చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సర్పంచ్ ఎన్నికల కోసం సీఎం ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ఎన్టీఆర్, వైఎస్ఆర్, కేసీఆర్ ఏనాడూ సర్పంచ్ ఎన్నికల ప్రచారం చేయలేదు. రేవంత్ చేస్తున్నారని విమర్శించారు. విజయోత్సవాల పేరుతో సీఎం రేవంత్ రెడ్డి గ్రామాల్లో పరోక్షంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ వచ్చాక గ్రామాలు సంక్షోభంలోకి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## క్షయ వ్యాధిపై విస్తృత అవగాహనతోనే నిర్మూలన సాధ్యం...

### డబ్ల్యూహెచ్ఓ సలహాదారు డా. మహేష్...




నాగర్‌కర్నూల్, **ఆకాంక్ష డిసెంబర్ 16:** క్షయ వ్యాధి (టీబీ) పట్ల సమాజంలో విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తేనే ఆ వ్యాధిని పూర్తిగా అంతం చేయవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సలహాదారు డాక్టర్ మహేష్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ సముదాయంలో ఉన్న సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని డాక్టర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, టీబీ నోడల్ పర్సన్స్‌తో పాటు వైద్య ఆరోగ్యశాఖకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ మహేష్ మాట్లాడుతూ, టీబీ లక్షణాలను తొలిదశలోనే గుర్తించి చికిత్స ప్రారంభిస్తే పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. క్షయ వ్యాధికి కారణమయ్యే బ్యాక్టీరియా, వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉన్న వర్గాలు, త్వరగా వ్యాధిని ఆకర్షించే పరిస్థితులు, వ్యాధి వ్యాప్తి విధానం వంటి అంశాలపై విపులంగా వివరించారు. అలాగే నిర్దిష్ట కాలం పాటు మందులు తప్పకుండా



వాడాల్సిన అవసరం, చికిత్స మధ్యలో నిలిపివేయడం వల్ల వచ్చే ప్రమాదాలు, మందుల దుష్ప్రభావాలపై కూడా అవగాహన కల్పించారు. డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీ గణ మాట్లాడుతూ, టీబీ రోగుల నుంచి ఇతరులకు వ్యాధి వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రివేళ చెమటలు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ వైద్యశాలలను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం టీబీ రోగుల కోసం అందిస్తున్న ఉచిత పరీక్షలు, మందులు, పోషకాహార సహాయం, ఇతర ప్రత్యేక సదుపాయాల గురించి కూడా వివరించారు.సమావేశంలో పాల్గొన్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ, క్షయ వ్యాధి నిర్మూలనలో వైద్య సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని అన్నారు. ప్రజల్లో అవగాహన పెంచడంలో ఫీల్డ్ స్థాయిలో పనిచేసే సిబ్బంది కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా టీబీ నియంత్రణలో మరింత సమర్థవంతంగా పనిచేసే అవకాశం ఏర్పడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి, భీమ నాయక్, క్షయ వ్యాధి ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఫిక్, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ కృష్ణమోహన్, భవిష్య భారత్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సజ్జాద్ అలీ, గోపి, టీబి సూపర్వైజర్లు శ్రీనివాసులు, ఆరిఫ్, రాజ్ కుమార్, గౌరీ కుమార్, ముక్తార్, సత్యా రెడ్డి, బాలు, శ్రీకాంత్ తధిరులు పాల్గొన్నారు.

## హెచ్‌పీవీ టీకాతో సర్వైకల్ క్యాన్సర్‌కు చెక్...

### 14 ఏళ్ల బాలికలకు వ్యాక్సినేషన్ అమలు....




నాగర్‌కర్నూల్,**ఆకాంక్ష డిసెంబర్ 16:** 14 సంవత్సరాల బాలికలకు హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకా ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ బారిన పడకుండా నివారించవచ్చని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్ తెలిపారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, పర్యవేక్షణ సిబ్బందికి హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.మహిళలకు వచ్చే క్యాన్సర్లలో సర్వైకల్ క్యాన్సర్ రెండో స్థానంలో ఉందని, దీనిని నివారించడమే లక్ష్యంగా 14 సంవత్సరాల బాలికలకు హెచ్‌పీవీ టీకాకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు డీఎంహెచ్‌వో వివరించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో సుమారు 9,500 మంది 14 సంవత్సరాల బాలికలు ఉండవచ్చని ప్రాథమిక అంచనా ఉందని తెలిపారు. ఈ నెలలో 14 సంవత్సరాలు పూర్తయిన బాలికల జాబితాను సిద్ధం చేసి, జనవరి నెలలో హెచ్‌పీవీ టీకాకరణను అమలు చేస్తామని వెల్లడించారు. క్షేత్రస్థాయి సిబ్బంది బాలికలకు, వారి తల్లిదండ్రులకు ముందుగానే అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారిగా ఆడ పిల్లల జననాలు తగ్గిన ప్రాంతాలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి, లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.అలాగే డిసెంబర్ 18 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కొత్తగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ముమ్మర సర్వే (ఎల్‌సీడీసీ) నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇళ్లకు వచ్చినప్పుడు ప్రజలు సహకరించాలని డీఎంహెచ్‌వో విజ్ఞప్తి చేశారు.తదుపరి ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ డాక్టర్ మహేష్ మాట్లాడుతూ, క్షయ వ్యాధి అనుమానితులైన మధుమేహ వ్యాధిగ్రస్తులు, మద్యం సేవించే వారు, ధూమపానం చేసే వారు, గతంలో క్షయ చికిత్స తీసుకున్న వారు, ప్రస్తుతం క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు ఎక్స్‌రే, కళ్లే పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రాథమిక దశలోనే క్షయ వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తే వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని వివరించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక సహకారంతో భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకుని, నాగర్‌కర్నూల్ జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా మార్చేందుకు సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ భరత్ రెడ్డి, డాక్టర్ భీమా నాయక్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ రఫీక్, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ కృష్ణమోహన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్లు డాక్టర్ మహేష్, డాక్టర్ శ్రీఘన, భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర మేనేజర్ గోపి, జిల్లా మేనేజర్ సజ్జత్ అలీ, జిల్లా ఉపమాస్ మీడియా అధికారి రాజగోపాల చారి, అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారులు బాదం రాజేష్, కొట్ర నిరంజన్, ఎన్‌డీవీ చారి, విజయ్, డీవీఎల్ఎం కుమార్‌తో పాటు వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, పర్యవేక్షణ సిబ్బంది, లెప్రసీ మరియు క్షయ వ్యాధి నోడల్ పర్సన్స్ పాల్గొన్నారు.

## ధనుర్మాస గోదాదేవి ప్రత్యేక పూజలు వైభవంగా ప్రారంభం...



నాగర్‌కర్నూల్.**ఆకాంక్ష డిసెంబర్ 16 :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం (రామాలయం) మరియు హౌసింగ్ బోర్డులోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం (గోవింద క్షేత్రం)లలో ధనుర్మాసం సందర్భంగా గోదాదేవి అమ్మవారి ప్రత్యేక పూజలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకొని ధనుర్మాస పూజల్లో పాల్గొన్నారు.గోవింద క్షేత్రంలో తెల్లవారుజామున ఆలయ ప్రధాన అర్చకులు కె. శ్రీకాంత్ ఆచార్యులు గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ధనుర్మాస పూజలను ప్రారంభించారు. తిరుప్పావై పాశుర పఠనం, సేవా కాలం, మహా మంగళహారతి, ప్రత్యేక నైవేద్యాల సమర్పణతో ఆలయం భక్తి వాతావరణంతో మార్మోగింది. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోవింద క్షేత్ర ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు సునేంద్ర కుమార్, నాగరాజ్ మాట్లాడుతూ ధనుర్మాసం సందర్భంగా ప్రతిరోజూ నిర్వహించే ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోదాదేవి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.రామాలయంలో 1972 సంవత్సరం నుండి నాగర్‌కర్నూల్‌లో ధనుర్మాస పూజలు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కందాడై కృష్ణమాచార్యులు ఈ సంప్రదాయాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. శ్రీ విశ్వావసు సంవత్సరానికి గాను ధనుర్మాస ప్రత్యేక పూజల తొలి రోజున మంగళవారం రాగిశెట్టి పుల్లయ్య, సుజాత దంపతులచే గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక ధనుర్మాస పూజలు నిర్వహించగా, రామాలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ పూజా కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.వేదమూర్తులైన బ్రాహ్మణులచే తిరుప్పావై పఠనం, సేవా కాలం, సామూహిక కుంకుమార్చన, అష్టోత్తర నామావళి, పుష్పాభిషేకం, ప్రత్యేక కుంకుమ



పూజలు ఘనంగా జరిగాయి. మహా మంగళహారతి, నక్షత్ర హారతి, కుంభ హారతి, కర్పూర హారతులతో అమ్మవారిని అలంకరించి భక్తి శ్రద్ధలతో సేవలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక నైవేద్యాలను నివేదించి, ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భక్తులచే విష్ణు సహస్రనామ పారాయణం, సామూహిక భజనలు నిర్వహించగా ఆలయ ప్రాంగణం భక్తి సంగీతంతో మార్మోగింది.ఈ కార్యక్రమంలో గోవింద క్షేత్ర ఆలయ కమిటీ సభ్యులు చిగుళ్లపల్లి రమణ కుమార్, బాల్ రాజు, కృష్ణమాచారి, ప్రశాంత్ రెడ్డి, శేఖర్ రెడ్డి, రామ్మోహన్, పెద్దపులి సుధీర్ బాబు పాల్గొన్నారు. అలాగే రామాలయ కమిటీ సభ్యులు అర్థం రవీందర్ మల్లేష్, గొల్ల రాములు, శారద, మన్యపు రెడ్డి రమాదేవి, వెంకట్ రెడ్డి, స్వామి, సాయి భక్తులు, మహిళా భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరై గోదాదేవి అమ్మవారి కృపను పొందారు.

## మెదక్ జిల్లా ఏడుపాయలలో కుక్కల బీభత్సం...

### వన దుర్గ భవాని ఆలయం వద్ద భక్తుల్లో భయాందోళన....

మెదక్. **ఆకాంక్ష డిసెంబర్ 16 :** మెదక్ జిల్లా ఏడుపాయలలోని ప్రసిద్ధ వన దుర్గ భవాని ఆలయం పరిసరాల్లో కుక్కల బెడద తీవ్రంగా మారింది. ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో సుమారు వందకు పైగా కుక్కలు తిరుగుతూ భక్తులు, స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్న ఘటన తాజాగా కలకలం రేపింది. ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా కుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. దాడిలో ఆ అధికారికి చేతికి, కాలికి కుక్క కరవడంతో అతడు కేకలు వేయగా,





సమీపంలో ఉన్న ప్రజలు స్పందించి కుక్కను వెంబడించి కొట్టడంతో అది పారిపోయింది. గాయపడిన వ్యక్తిని వెంటనే మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో ఆలయానికి వచ్చే భక్తులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రత్యేకించి పండుగలు, శుభకార్యాల సమయంలో ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో కుక్కల బెడద మరింత ప్రమాదకరంగా మారుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు తీవ్ర భయంతో ఆలయానికి రావడానికి వెనుకాడుతున్న పరిస్థితి నెలకొంది.కుక్కల నియంత్రణకు వెంటనే చర్యలు తీసుకోవాలని, స్టెరిలైజేషన్, పునరావాస చర్యలు చేపట్టాలని భక్తులు, స్థానిక ప్రజలు మున్సిపల్, సంబంధిత అధికారులను కోరుతున్నారు. ఆలయ పరిసరాల్లో భద్రతా చర్యలు పెంచి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కోల్‌కతా స్టేడియం ఘటన..
## స్పోర్ట్స్ మినిస్టర్ రాజీనామాకు సీఎం ఆమోదం...



కోల్‌కతా **ఆకాంక్ష డిసెంబర్ 16** : అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ పర్యటన సందర్భంగా గత ఆదివారం పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా లోని సాల్ట్ లేక్ స్టేడియంలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఆ ఉద్రిక్తతలకు బాధ్యత వహిస్తూ బెంగాల్ స్పోర్ట్స్ మినిస్టర్ అరూప్ బిశ్వాస్ తన పదవికి రాజానామా చేయగా.. ఆ రాజీనామాకు సీఎం మమత బెనర్జీ ఆమోదముద్ర వేశారు. సాల్ట్ లేక్ స్టేడియానికి వచ్చిన మెస్సీని చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో ఎగబడ్డారు. అయితే సరైన ఏర్పాట్లు లేకపోవడంతో వారిని లోపలికి పంపడంలో ఆలస్యం జరిగింది. మెస్సీ కార్యక్రమం ముగించుకుని వెళ్లేసరికి ఇంకా సగం మంది స్టేడియం బయటే ఉన్నారు. దాంతో తమ దగ్గర డబ్బులు వసూలు చేసి స్టేడియంలోపలికి ఎందుకు అనుమతించలేదని అభిమానులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈవెంట్ నిర్వాహకుల తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. స్టేడియంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఈ ఘటన రాజికీయంగా కూడా తీవ్ర దుమారం రేపింది. మెస్సీ పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయించడంలో బెంగాల్ ప్రభుత్వం విఫలమైందని ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఈ నేపథ్యంలో బెంగాల్ క్రీడా శాఖ మంత్రి అరూప్ బిశ్వాస్ తన పదవికి రాజీనామా చేశారు. వెంటనే ఆ రాజీనామాకు సీఎం మమతా బెనర్జి ఆమోదముద్ర వేశారు.

## ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్
## ఏలూరు జిల్లా కమిటీ నియామకం...




ఏలూరు**ఆకాంక్ష డిసెంబర్ 16:** ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ సమావేశం ఆంధ్రప్రదేశ్, ఏలూరు జిల్లా, కుక్కునూర్ మండలం, కివ్వక ఆఫీస్ లో జరిగినది. ఈ సమావేశమునకు హైదరాబాద్ నుండి ఐఎన్ఎస్ హెచ్‌ఆర్‌ఎఫ్ సంస్థ డా. సిహెచ్ విజయమోహనరావు, డీజీసీఈఓ చైర్మన్ హాజరైనారు. ఏలూరు జిల్లా కమిటీ ని నియమిస్తూ అధికారపత్రములను అందజేస్తూ సమాజములో ఉన్న అసమానతలు రూపుమాపటానిని,ఫండమెంటల్ రైట్స్, చట్టమును గౌరవించాలని మరియు డ్రగ్స్ లంచముల గురించి అవగాహన సదస్సులు పాఠశాలలో, కాలేజీ లలో పెడుతూ విద్యార్థులకు అవేర్నెస్ ప్రోగ్రామ్స్ ద్వారా నో క్రైమ్ నేషన్ నిర్మించాడానికి అందరు కృషి చేయాలని కోరారు. ఇంటర్నేషనల్ హుమానరైట్స్ ద్వారా సుమారు 28 స్టేట్స్ లో మరియు 15 కంట్రీస్ లో ఈ విధమైనా కార్యాక్రమములు జరుగుతున్నాయని డీజీసీఈఓ చైర్మన్ వివరించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఏలూరు జిల్లా కమిటీ నియామకం జరిగింది. చీఫ్ అడ్వైసర్ గా మంత్రి. గోపాలకృష్ణ, ప్రసిడెంట్ కోలపూడి. వసంతరావు, జనరల్ సెక్రెటరీ,శ్రీ సుధాకర్ రావు, వైస్ ప్రసిడెంట్ బుడుగుల తరుణ్, డిస్ట్రిక్ట్ కోర్డినేటర్,బయ్యని. నాగేశ్వరావును నియమించినారు.

## సింగరేణి సీఎండీగా డి.కృష్ణ భాస్కర్ బాధ్యతల స్వీకరణ...



హైదరాబాద్.**ఆకాంక్ష డిసెంబర్ 16:** హైదరాబాద్ జిల్లా కేంద్రంలోని సింగరేణి భవన్‌లో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ నూతన సీఎండీగా (ఎఫ్ఏసీ) శ్రీ డి.కృష్ణ భాస్కర్ అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. సింగరేణి సంస్థ ప్రస్తుత సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ ఏడు సంవత్సరాల డిప్యూటేషన్ పూర్తి చేసుకుని మాతృ విభాగానికి తిరిగి వెళుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి డి.కృష్ణ భాస్కర్‌ను సీఎండీ (ఎఫ్ఏసీ)గా నియమించింది. ఈ నేపథ్యంలో సింగరేణి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో డి.కృష్ణ భాస్కర్, ప్రస్తుత ఛైర్మన్ ఎన్.బలరామ్ నుంచి అధికారికంగా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా సింగరేణి డైరెక్టర్లు,జనరల్ మేనేజర్లు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఘన స్వాగతం పలికారు. సంస్థ భవిష్యత్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నూతన సీఎండీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. డి.కృష్ణ భాస్కర్ 2012 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పరిపాలనా రంగంలో విశేష అనుభవం కలిగిన అధికారిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. గతంలో ఆయన రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు కలెక్టర్‌గా సేవలందించారు. పరిశ్రమల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఆయన తెలంగాణ ఇండస్ట్రీస్ శాఖ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. అలాగే రాష్ట్ర ఆర్థిక మరియు ప్రణాళిక శాఖలో స్పెషల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తూ పలు కీలక విధానాల అమలులో తనదైన ముద్ర వేశారు. సింగరేణి సంస్థకు నూతన నాయకత్వం లభించిన నేపథ్యంలో సంస్థ కార్యకలాపాలు మరింత పటిష్టంగా కొనసాగుతాయని ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రానికి ఆర్థికంగా కీలకమైన సింగరేణి సంస్థను మరింత అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత ఇప్పుడు శ్రీ డి.కృష్ణ భాస్కర్ భుజాలపై నిలిచింది.

## మూడో అంతస్తు నుంచి
## చిన్నారిని కిందకు పడేసిన కసాయి తల్లి...



హైదరాబాద్**ఆకాంక్ష డిసెంబర్ 16:** మల్కాజ్‌గిరి.. వసంతపురి కాలనీలో దారుణం చోటు చేసుకుంది. ఏడు సంవత్సరాల చిన్నారి షారోని మేరిని ఆమె కన్నతల్లి మోనాలిసా మూడో అంతస్తు బిల్డింగ్ పైనుంచి కిందకు పడేసింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన చిన్నారిని గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై స్థానికుల సమాచారం మేరకు మల్కాజ్‌గిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గాంధీజీ ఆదర్శాలను
## మోడీ ప్రభుత్వం అవమానిస్తోంది...

### మండిపడ్డ రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ.**ఆకాంక్ష డిసెంబర్ 16:** గ్రామీణుల కోసం దేశవ్యాప్తంగా అమలులో ఉన్న మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్ఇజిఎ) పేరు మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ప్రతిపక్షనేత, కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ.. కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేశారు. గాంధీజీ ఆదర్శాలను మోడీ ప్రభుత్వం అవమానిస్తోందని మండిపడ్డారు. ప్రధాని మోడీకి రెండు అంశాలు అసలు గిట్టవన్నారు. ఒకటి, గాంధీ ఆలోచనలు.. రెండు, పేదల హక్కులు మోడీకి నచ్చవని ఫైరయ్యారు. గాంధీజీ గ్రామ స్వరాజ్యం ఆలోచనల ప్రతిరూపమే ఉపాధి హామీ పథకమని.. ఈ పథకం గ్రామీణులకు జీవనరేఖ లాంటిది ఆయన పేర్కొన్నారు. ఈ పథకం పేదలకు ఆర్థిక భద్రత కల్పిస్తుందని రాహుల్ గాంధీ అన్నారు. కాగా, ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్త చట్టం తీసుకువచ్చే దిశగా కేంద్రం చర్యలు ముమ్మరం చేసింది. సోమవారం లోక్‌సభలో మూడు కీలక బిల్లులతో పాటు ఉపాధి హామీ స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవక్ మిషన్(గ్రామీణ్)(విబిజి ఆర్ఎఎం జి)2025 పేరిట కొత్త బిల్లును ప్రవేశపెట్టేందుకు సిద్ధమైనప్పటికీ విపక్షాల తీవ్ర వ్యతిరేకత నడుమ వెనక్కి తగ్గింది. అయితే లోక్‌సభ సభ్యులకు నూతన బిల్లు ప్రతులను అందజేసినట్లు సమాచారం.

# యూరియా పేరుతో రైతులకు శిక్ష...

### కాంగ్రెస్ పాలనలో సాగు సంక్షోభానికి దారితీస్తున్న నిర్ణయాలు...




హైదరాబాద్ **ఆకాంక్ష డిసెంబర్ 16:** రాష్ట్రంలో యూరియా పంపిణీ విధానాన్ని పూర్తిగా మార్చుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయాలు రైతులపై శిక్షలా మారాయని, ముఖ్యంగా కౌలు రైతులపై కక్షపూరిత వైఖరిని స్పష్టంగా చూపిస్తున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. యూరియా కొరతను తామే సృష్టించి, ఆపై ఆడలేక మద్దెలోడు అన్నట్లుగా రైతులపై భారాలు మోపడం అన్యాయమని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలోనే యూరియా కొరత ఎందుకు వస్తోందన్న ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టెనెన్సీ యాక్ట్‌ను అడ్డంపెట్టుకుని అసలు రైతులు, కౌలు రైతుల మధ్య చిచ్చుపెట్టేలా యూరియా పంపిణీ నిబంధనలు రూపొందించడం అత్యంత ప్రమాదకర పరిణామమని నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. ఈ విధానంతో అసలు రైతులు భవిష్యత్తులో కౌలుకు భూములు ఇవ్వడానికి ముందుకు రాకపోవచ్చని, ఫలితంగా సాగు విస్తీర్ణం తగ్గిపోయే కుట్రలా ఇది కనిపిస్తోందని అన్నారు. రాష్ట్ర వ్యవసాయానికి ఇది దీర్ఘ కాలికంగా నష్టం కలిగించే నిర్ణయమని ఆయన స్పష్టం చేశారు. ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేయాలన్న నిర్ణయం మరింత అనుమానాస్పదమని పేర్కొన్నారు. దళారులు రైతుల పేర్ల మీద యూరియాను బుక్ చేసి అక్రమాలకు పాల్పడే అవకాశం పెరుగుతుందని, నిరక్షరాస్యులైన రైతులు, స్మార్ట్ ఫోన్ వాడటం రాని రైతులు ఈ విధానంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నెట్‌వర్క్ లేని చోట ఈ విధానాన్ని ఎలా అమలు చేస్తారో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. యూరియా వాడకంపై రైతులకు సరైన అవగాహన కల్పించకుండా, ఒక్కసారిగా యాప్ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడం అనాలోచిత చర్య అని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. ముందుగా కొన్ని జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసి, లోపాలు సరిదిద్దాల్సిన అవసరం ఉండగా, అలాంటి ప్రయత్నం చేయకుండానే మొత్తం రాష్ట్రంలో అమలు చేయాలనుకోవడం రైతులపై ప్రయోగం చేయడమేనని విమర్శించారు. యూరియా ధర కన్నా రవాణా కిరాయి రైతులకు అధిక భారం అయ్యేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ఆరోపించారు. ఆధార్, పట్టాదార్ పాసుబుక్, ఓటీపీ వంటి ప్రక్రియలు రైతులకు ఉపయోగ పడకుండా ప్రహసనంగా మారాయని, ఈ కఠిన నిబంధనలతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కేసీఆర్ పాలనలో రాజులా బతికిన రైతు, కాంగ్రెస్ పాలనలో సాగు మొదలుకొని పంట అమ్మకాల వరకు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నాడని ఆయన వ్యాఖ్యానించారు. అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15 వేల రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, దానిని రూ.12 వేలకే కుదించి నాలుగు సార్లు ఎగ్గొట్టిందని నిరంజన్ రెడ్డి గుర్తుచేశారు. కౌలు రైతులకూ రైతు భరోసా ఇస్తామని చెప్పి చివరకు వారికి మొండి చేయి చూపించిందని ఆరోపించారు. ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించి, ఆ మాటకు జాడ లేకుండా పోయిందని, పాత బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో తెలియక రైతులు ఎదురుచూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కక్ష కట్టినట్టే వ్యవహరిస్తోందని, అందుకే అడుగడుగునా అవాంతరాలు సృష్టిస్తూ వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని మాజీ మంత్రి తీవ్రంగా ధ్వజమెత్తారు. యూరియా పంపిణీకి యాప్ విధానాన్ని అమల్లోకి తేవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించి రైతులకు అనుకూలమైన విధానాన్ని తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

## లేట్ నైట్ పార్టీలు.. శిల్పా శెట్టి
## రెస్టారెంట్‌పై పోలీస్ కేసు!



బెంగళూరు.**ఆకాంక్ష డిసెంబర్ 16:** బాలీవుడ్ నటి శిల్పా శెట్టికి చెందిన ప్రముఖ రెస్టారెంట్ 'బాస్టియన్' బెంగళూరులో మరో వివాదంలో చిక్కుకుంది. అనుమతించిన సమయం కంటే ఎక్కువసేపు కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు, అర్ధరాత్రి పార్టీలకు అనుమతించి నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను బెంగళూరు పోలీసులు ఈ రెస్టారెంట్‌పై ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేశారు. సెయింట్ మార్క్స్ రోడ్‌లో ఉన్న 'బాస్టియన్' రెస్టారెంట్ డిసెంబర్ 11న రాత్రి 1.30 గంటల వరకు కార్యకలాపాలు కొనసాగించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇది పోలీసులు ఇచ్చిన సమయానికంటే ఎక్కువ సేపు నిర్వహించినట్లు సమాచారం. దీంతో కర్ణాటక పోలీస్ చట్టంలోని సెక్షన్ 103 కింద సుమోటో ఫిర్యాదుల ఆధారంగా కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు మేనేజర్‌లు, ఇతర సిబ్బందిపై కేసులు నమోదు అయ్యాయి. బాస్టియన్'తో పాటు, రెసిడెన్సీ రోడ్‌లో ఉన్న 'సౌర్ బెర్రీ పబ్' పై కూడా కేసు నమోదు చేశారు. ఈ దర్యాప్తులో భాగంగా పబ్ సిబ్బందితో సహా ఎనిమిది మంది వాంగ్మూలాలను పోలీసులు రికార్డు చేశారు.

## శ్రీ హరి చందనం'భావ పరిమళ భరితం...

### తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి...



హైదరాబాద్.**ఆకాంక్ష డిసెంబర్ 16:** శ్రీ హరిచంద్ర లాంటి మంచి మనసున్న కవి బాలకృష్ణ నేతాజీ రాసిన కవితల్లో అనేక అనేక సమాజ పౌరులు దేశంలోని మనస్తత్వ విషయాలు భోదపరుస్తాయని ముఖ్య అతిథి తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఎవర్గ్రీన్ యూత్ అసోసియేషన్ మానస ఆర్ట్ థియేటర్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత నేతాజీ రచించిన శ్రీ హరిచందనం కవిత్వాసం పొట్టి ఆవిష్కరణ కార్యక్రమం రవీంద్ర భారతి సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది నేటినిజం సంపాదకులు బైసా దేవదాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ కేవీ రమణాచారి ముఖ్యఅతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రచయిత అనేక విషయాలను వర్తమాన సమాజంలో అవకతవకలు అన్యాయాలను నిజాయితీగా ఆవేదనతో రాసిన కవితలు ఆలోచింపజేసే విధంగా ఉన్నాయని అన్నారు. ఈ సభలో డాక్టర్ ఈ యాదగిరి శర్మ, నేతాజీ, దేవదాస్ తదితరులు ప్రసంగించారు. సభా కార్యక్రమానికి ముందు నక్క భాస్కర్ అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనంలో డాక్టర్ మేడిశెట్టి వెంకటేశ్వర్లు బొల్లి ముంత వెంకటరమణ నారాయణరెడ్డి, మిద్దె సురేష్, పాలపర్తి సంధ్యారాణి, భాస్కర్, టీవీ స్వామి తదితరులు చేశారు నిర్వాహ సంస్థల పక్షాన బండారుపల్లి రామచంద్రరావు రఘు శ్రీ సభ సమన్వయం గావించారు

## పార్టీ నేతలు గొడవలకు దిగితే కఠిన చర్యలు....

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హెచ్చరిక...



హైదరాబాద్.**ఆకాంక్ష డిసెంబర్ 16:** పార్టీ నేతలు గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తెలిపారు. వార్డుల పునర్విభజనను బిజెపి పూర్తిగా వ్యతిరేకిస్తోందని అన్నారు. జిహెచ్ ఎంసిలో విలీన ప్రాంతాల జిల్లా బిజెపి అధ్యక్షులు, బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ముఖ్యనేతలతో భేటీ అయ్యారు. మున్సిపాలిటీల విలీనం, డివిజన్ల పెంపుపై సమావేశంలోచర్చ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..స్థానిక సమస్యలపై కార్యకర్తలు పోరాటం చేయాలని, మనం రాజకీయ వర్కర్స్ అనేది గుర్తించి పనిచేయాలని సూచించారు. బిజెపి మేయర్ పదవిని తప్పని సరిగా గెలవాలని రామచందర్ రావు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ గూండాల దాడిలో గాయపడ్డ
## బిట్ల బాలరాజు దంపతులకు కేటీఆర్ పరామర్శ...



హైదరాబాద్. **ఆకాంక్ష డిసెంబర్ 16:** కాంగ్రెస్ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఎల్లారెడ్డి నియోజకవర్గం సోమార్‌పేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బిట్ల బాలరాజు, ఆయన భార్య గంజి భారతి దంపతులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో కలిసి ఆసుపత్రికి వెళ్లిన కేటీఆర్, బాధితులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత దంపతులకు కేటీఆర్ ధైర్యం చెప్పి, ఇలాంటి దాడులతో ప్రజాస్వామ్యాన్ని భయపెట్టలేరని స్పష్టం చేశారు. రాజకీయ ప్రత్యర్థులపై దాడులు చేయడం కాంగ్రెస్ సంస్కృతిగా మారిందని విమర్శించారు. ఎన్నికల్లో ప్రజల మద్దతు కోల్పోయిన వారు హింసకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడి ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుల వైద్య చికిత్సకు అయ్యే మొత్తం ఖర్చును పార్టీనే భరిస్తుందని కేటీఆర్ ప్రకటించారు. బిట్ల బాలరాజు, గంజి భారతి దంపతులకు బీఆర్ఎస్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, న్యాయం జరిగే వరకు పోరాడుతుందని భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు బీఆర్ఎస్ వెనకడుగు వేయదని, హింస రాజకీయాలకు తగిన సమాధానం తప్పకుండా ఇస్తామని పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొని బాధితులకు సంఘీభావం తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో చోటుచేసుకున్న ఈ దాడి ఘటనపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతుండగా, శాంతి భద్రతల పరిరక్షణపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## బిఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ,
## ఎల్పీ సమావేశాలు 21కి వాయిదా...



హైదరాబాద్,**ఆకాంక్ష డిసెంబర్ 16:** బిఆర్ఎస్ పార్టీ అధినేత శ్రీ కే. చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు ఈ నెల 19వ తేదీన నిర్వహించాల్సిన బిఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం మరియు బిఆర్ఎస్ ఎల్పీ సమావేశాన్ని ఈ నెల 21వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు పార్టీ వర్గాలు ప్రకటించాయి. పార్లమెంట్ సమావేశాలు ఈ నెల 19తో ముగియనున్న నేపథ్యంలో బిఆర్ఎస్‌కు చెందిన పార్లమెంట్ సభ్యులు కూడా సమావేశంలో పాల్గొనేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కేసీఆర్ అధ్యక్షతన ఈ నెల 21వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ వేదికగా బిఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి గౌరవ పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు హాజరుకానున్నారు. రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీ వ్యూహాలు, రాబోయే కార్యాచరణపై కీలక చర్చలు జరగనున్నాయని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## 600 బిలియన్ డాలర్ల
## తొలి సంపన్నుడిగా ఎలన్ మస్క్ రికార్డు



ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన ఎలన్ మస్క్ మరిన్ని కొత్త రికార్డులతో ఎవ్వరికీ అందనంత ఎత్తుకు వెళ్తున్నారు. తాజాగా ప్రపంచంలోనే 600 బిలియన్ డాలర్ల(మన కరెన్సీలో రూ. 54.54 లక్షల కోట్లు) సంపద ఉన్న మొదటివ్యక్తిగా నిలిచారు. మస్క్‌కు చెందిన స్పేస్ఎక్స్ స్టార్టప్ 800 బిలియన్ల డాలర్ల విలువతో ఐపీఓకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆయన సంపద భారీగా పుంజుకుంది. ఈ ఏడాది అక్టోబర్‌లోనే మొదటిసారిగా 500 బిలియన్ డాలర్ల మార్కును అధిగమించిన మస్క్, వచ్చే ఏడాది ఐపీఓకు వస్తున్న స్పేస్ఎక్స్‌లో 42 శాతం వాటాను కలిగి ఉన్నట్టు రాయిటర్స్ పేర్కొంది. ఫోర్బ్స్ ప్రకారం, స్పేస్ఎక్స్ వాల్యుయేషన్ కారణంగా మస్క్ సంపద 168 బిలియన్ డాలర్లు పెరిగి 677 బిలియన్ డాలర్లకు చేరింది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కంపెనీ టెస్లాలో మస్క్‌కు దాదాపు 12 శాతం వాటా ఉంది. ఈ ఏడాది ఇప్పటివరకు టెస్లా షేర్లు అమ్మకాలు తగ్గినప్పటికీ 13 శాతం పెరిగాయి. ఎలన్ మస్క్ సంపద 600 బిలియన్ డాలర్లు పెరగడ్మతో ప్రపంచంలో ఏ ధనవంతుడు సాధించని స్థాయిలో సంపదను సంపాదించారు.

# ఐపీఎల్ మినీ వేలంలో సంచలనం.. అన్ క్యాప్డ్ ప్లేయర్‌గా వచ్చి కోట్లు కొల్లగొట్టిన యువ ఆటగాళ్లు



ఐపీఎల్ 2026 కి సంబంధించిన మినీ వేలం ఉత్కంఠగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మూడో రౌండ్ లో జరిగిన అన్ క్యాప్డ్ ప్లేయర్లే వేలంలో యువ ప్లేయర్లు ఆకిబ్ దార్, ప్రశాంత్ వీర్ సంచలనం సృష్టించారు. ఎవరూ ఊహించిన విధంగా 30 లక్షల బేస్ ప్రైజ్ పై వేలం లోకి వచ్చిన యువ ప్లేయర్లను ఆయా జట్లు కోట్లు పెట్టి కొనుగోలు చేసింది. వారిలో ప్రశాంత్ వీర్ అన్‌క్యాప్డ్ ఆటగాడిగా వేలంలోకి రాగా అతని కోసం చెన్నై, ఫ్రాంచైజీల మధ్య హోరాహోరీగా వేలం సాగింది. ఒక దశలో అతని ప్రస్తుత బిడ్ 14.20 కోట్లకు చేరింది. చివరికి ఈ యువ ప్లేయర్ ని చెన్నై జట్టు 14.20 కోట్లకు కొనుగోలు చేసింది. అలాగే జమ్మూకశ్మీర్‌కు చెందిన యువ పేస్ ఆల్‌రౌండర్ ఆకిబ్ దార్ కూడా భారీ ధర పలికాడు. అతడిని ఢిల్లీ క్యాపిటల్స్‌జట్టు 8.40 కోట్లకు దక్కించుకుని తమ బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసుకుంది. ఇతను కూడా అన్ క్యాప్డ్ ప్లేయర్ గా కేవలం 30 లక్షల బేస్ ప్రైజ్ తో వచ్చి ఏకంగా 8.40 కోట్ల ధర పలికాడు. మరోపక్క గతంలో వివిధ జట్లకు ఆడిన సీనియర్ ప్లేయర్లు ఏ జట్టు కనీసం బేస్ ప్రైజ్ పై కొనుగోలు చేయకపోవడం ఆశ్చర్యంగా నిలిచింది. ఇదిలా ఉంటే మరో యువ ప్లేయర్ అయిన కార్తీక్ శర్మ కూడా భారీ ధరకు అమ్ముడు పోయాడు. 30 లక్షల బేస్ ధరతో వేలంలో నిలిచిన అతన్ని కొనుగోలు చేసేందుకు చెన్నై, కేకేఆర్, హైదరాబాద్ జట్లు పోటీ పడ్డాయి. దీంతో యువ ఆటగాడు ఎవరూ ఊహించని విధంగా మినీ వేలంలో 14.20 కోట్లకు బ్యాటర్ కమ్, వికెట్ కీపర్ అయిన కార్తీక్ శర్మను చెన్నై జట్టు సొంతం చేసుకుంది. దీంతో అన్‌క్యాప్డ్ ప్లేయర్లలో అత్యధిక ధర పలికిన ప్లేయర్ గా కార్తీక్ శర్మ నిలిచాడు.

# వింటర్‌లో కర్డ్ తింటున్నారా..? అయితే ఈ విషయం తెలుసుకోవాల్సిందే..!



శీతాకాలంలో చాలా మంది పెరుగు తింటుంటారు. అయితే చాలా మందికి వింటర్‌లో కర్డ్ తినొచ్చా తింటే ఏమైనా ప్రాబ్లం ఉంటుందా అని చాలా మంది అనుమానం వ్యక్తం చేస్తుంటారు. మరి శీతాకాలంలో పెరుగు తీసుకోవచ్చో లేదో ఇప్పుడు మనం చూద్దాం.. బేసిక్‌గా ప్రోబయోటిక్స్ అధికంగా ఉండే పెరుగును తీసుకోవడం మీ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరం. అయితే దీనిని శీతాకాలంలో తీసుకోవడం వల్ల జలుబు, దగ్గు సమస్యలను కలిగిస్తుందని చాలా మంది భయపడుతుంటారు. కానీ, సీజన్‌తో పనిలేకుండా పెరుగు తినడం ఆరోగ్యానికి మంచిది. అయితే చలికాలంలో తప్పు సమయంలో తింటే ఇబ్బంది కలగవచ్చు. సాధారణంగా పెరుగు తీసుకోవడం వల్ల జీర్ణశక్తిని, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. కానీ సరిగ్గా తీసుకోకపోతే సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. పెరుగును సాధారణ ఉష్ణోగ్రత వద్ద మాత్రమే తినాలని గుర్తుంచుకోండి. ఉదయం పూట పెరుగు తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రోటీన్, కాల్షియం, రిబోఫ్లేవిన్, విటమిన్ బి6, విటమిన్ బి12 వంటి ముఖ్యమైన పోషకాలతో కర్డ్ నిండి ఉంది. ఈ పోషకాలు రోజువారీ శరీర విధులకు సహాయపడతాయి. జీవక్రియను మెరుగుపరుస్తాయి. మొత్తం ఆరోగ్యాన్ని బలపరుస్తాయి. పెరుగు పోషక విలువలు మెరుగైన రోగనిరోధక శక్తికి, జీర్ణ ఆరోగ్యానికి తోడ్పడతాయి. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పేగుల సమతుల్యతను కాపాడటం ద్వారా, శరీర సహజ రక్షణ వ్యవస్థకు మద్దతు ఇవ్వడం ద్వారా అనేక సాధారణ సమస్యలను తగ్గించవచ్చు.అయితే చలికాలంలో పోషకాహార నిపుణులు పెరుగును పగటిపూట తినమని చెబుతున్నారు. ఉదయం లేదా మధ్యాహ్నం సమయంలో తీసుకోవడం వల్ల శరీరం దాన్ని సులభంగా జీర్ణం చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. చల్లబరిచే, పోషక లక్షణాలను పూర్తిగా ఉపయోగించుకోవచ్చు.పెరుగులో కాల్షియం, ఫాస్పరస్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకల బలాన్ని కాపాడటానికి అవసరమైన రెండు ముఖ్యమైన ఖనిజాలు. రోజూ పగటిపూట తీసుకోవడం వల్ల ఎముకల సాంద్రత, మొత్తం అస్థిపంజర ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పెరుగు తక్కువగా కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. పెరుగులో లాక్టిక్ ఆమ్లం ఉంటుంది. ఇది చర్మాన్ని సున్నితంగా ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది. మృత కణాలను తొలగిస్తుంది. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పొడిబారడం, మందగించటానికి పేరుగాంచిన శీతాకాలంలో స్పష్టమైన, ఆరోగ్యకరమైన చర్మం కనిపించడానికి సహాయపడుతుంది. ఇక రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి కాబట్టి.. రాత్రిపూట పెరుగు తినడం జీర్ణక్రియకు ఆటంకం కలిగిస్తుంది. అలాగే కొంతమందిలో శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. చల్లదనం కారణంగా చలి, దగ్గు, గొంతు నొప్పి లేదా సైనస్ సమస్యలు వంటి లక్షణాలు తీవ్రమవుతాయి. కాబట్టి ఉదయం, మధ్యాహ్నం మాత్రమే పెరుగు తినండి.

# బేస్ ప్రైజ్ కే హసరంగాను దక్కించుకున్న లక్నో.. ప్లాన్ అదుర్స్



ఐపీఎల్ 2026 సీజన్ కు సంభందించిన మినీ వేలం ఈ రోజు ప్రారంభం అయింది. ఈ మినీ వేలంలో కెమరూన్ గ్రీన్ 25.20 కోట్లకు అమ్ముడు పోయి చరిత్రలో నిలిచాడు. ఇదిలా ఉంటే పలు కీలక ప్లేయర్లను బెస్ ధరకు కూడా కొనడానికి ఏ జట్టు ముందుకు రాలేదు. ఈ జాబీతాలో భారత జట్టులోని యువ ప్లేయర్ పృథ్వీ షా ఉన్నాడు. ఇదిలా ఉంటే లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు ఈ ఐపీఎల్ వేలంలో ఊహించని జాక్‌పాట్ తగిలింది. శ్రీలంక స్టార్ లెగ్-స్పిన్నర్ వనిందు హసరంగాను కేవలం రూ. 2 కోట్ల కనీస ధరకు లక్నో సొంతం చేసుకుంది. స్పిన్ ఆల్‌రౌండర్‌గా ప్రపంచవ్యాప్తంగా పేరున్న హసరంగా, గత సీజన్లలో రూ. 10 కోట్లకు పైగా ధర పలికిన అనుభవం ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత ప్రమాదకరమైన స్పిన్నర్లలో ఒకడైన హసరంగా, ఈ వేలంలో కూడా భారీ ధర పలికే అవకాశం ఉంటుందని అంచనా వేశారు. కానీ, ఏ ఫ్రాంచైజీ కూడా పోటీ పడకపోవడంతో లక్నో సూపర్ జెయింట్స్ తమ బేస్ ప్రైస్‌కు అతన్ని సొంతం చేసుకుని బిగ్ డీల్‌ను దక్కించుకుంది. లక్నో యాజమాన్యం తమ పర్స్‌లో డబ్బును ఆదా చేసుకుంటూనే, జట్టుకు అత్యంత అవసరమైన క్లాస్ స్పిన్ ఆల్‌రౌండర్‌ను అతి తక్కువ ధరకు తీసుకోవడంలో సఫలమైంది. హసరంగా రాకతో, కెప్టెన్ కేఎల్ రాహుల్ నాయకత్వంలోని లక్నో జట్టు, రవి బిష్ణోయ్‌తో కలిసి బలమైన స్పిన్ ద్వయాన్ని ఏర్పాటు చేసుకోనుంది. పొదుపుగా బౌలింగ్ చేస్తూ, కీలక వికెట్లు తీయగల సామర్థ్యం హసరంగా సొంతం. అంతేకాకుండా, లోయర్ ఆర్డర్‌లో అతను మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడగలడు. కేవలం రూ. 2 కోట్లకే దొరకడం %ూా+%కి ఒక మెగా విజయం అనే చెప్పాలి. ఈ కొనుగోలుతో లక్నో ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేవు!

# ఐపీఎల్ మినీవేలం 2026: టీమిండియా ఓపెనర్‌పై ఆసక్తి చూపని ఫ్రాంచైజీలు




క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఐపీఎల్-2026 మినీ వేలం ప్రారంభమైంది. తమ జట్లను బలోపేతం చేసుకోవడం కోసం ఫ్రాంఛైజీలు గట్టిగా పోటీపడుతున్నాయి. విదేశీ ఆటగాళ్లను కోట్లు పెట్టి కొనుగోలు చేస్తున్న ఫ్రాంచైజీలు భారత ఆటగాళ్లపై మాత్రం మొగ్గు చూపడం లేదు. భారత ఆటగాడు, ఓపెనర్ పృద్వీ షాను కొనుగోలు చేసేందుకు ఏ జట్టూ ఆసక్తి చూపడం లేదు. ఈ వేలంలో మొత్తం 77 మంది క్రీడాకారులు ఉన్నారు. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్‌ను రూ.25 కోట్లకు కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు కొనుగోలు చేసింది. మరోవైపు.. సౌతాఫ్రికా స్టార్ డేవిడ్ మిల్లర్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రూ.2 కోట్లకు కొనుగోలు చేసింది. అబుదాబీ వేదికగా ఈ మినీ వేలం జరుగుతోంది. పది ఫ్రాంఛైజీల్లో రూ.2.75 కోట్ల పర్స్‌తో ముంబయి ఇండియన్స్ చివరిస్థానంలో ఉంది. కోల్‌కతా నైట్ రైడర్స్ వద్ద అత్యధికంగా రూ.64.30 కోట్లు ఉన్నాయి.

# కొత్త సంవత్సరంలో కొంగ్రొత్తగా.. వీటిని వదిలేద్దాం.. హ్యాపీగా గడిపేద్దాం.. !




కాలం పరుగెడుతూనే ఉంది. చూస్తుండగానే డిసెంబర్ వచ్చేసింది. మరికొన్ని రోజుల్లో కొత్త సంవత్సరం(2026)లోకి అడుగు పెడతాం. అయితే ఏంటి అనుకుంటున్నారా? చాలా మందికి తాము ఏం సాధించామో మరోసారి వెనక్కి తిరిగి చూసుకునే సందర్భమిదే. గతేడాది పెట్టుకున్న లక్ష్యాలు, అనుకున్న పనులు ఎంత వరకు నెరవేరాయో నెమరు వేసుకునే తరుణమూ ఇదే. అట్లనే కొంగ్రొత్త ఆలోచనలతో, లక్ష్యాలతో కొత్త సంవత్సరంలో తాము మారాలనుకేనేవారికి కూడా ఇది సందర్భమే. అందుకే చాలా మంది జరిగిందేదో జరిగింది. గతమంతా ఏదోలా గడిచింది. ఈ కొత్త సంవత్సరం నుంచైనా సంతోషంగా ఉండాలని భావించే వారు కొన్ని విషయాల్లో మారాలని, కొన్ని ఆలోచనలను వదులుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అవేమిటో చూద్దాం. అతి ఆలోచనలు వద్దే వద్దు ! మీరు పుట్టి పెరిగిన వాతావరణం, చుట్టు పక్కల సామాజిక పరిస్థితులు, ఆపదలు, ఆటంకాలు, సంతోషాలు, సరదాలు ఇలా ప్రతీ అనుభవం మీకు ఏదో ఒకటి నేర్పి ఉంటుంది. అవన్నీ మీలో కొన్ని ఆలోచనలు స్థిరపడేలా, వ్యక్తిత్వం రూపు దిద్దుకునేలా కూడా సహాయపడి ఉండవచ్చు. అయితే అవన్నీ మీకు మేలు చేసేవి అయినప్పుడు సమస్యలేమీ ఉండవు. కానీ కొన్ని ఆలోచనలు కాలంతోపాటు మిమ్మల్ని మారనివ్వకుండా వెంటాడుతుంటాయి. మరి కొన్ని మీ అభివృద్ధికి ఆటంకంగా మారవచ్చు. అలాంటి వాటిలో ఓవర్ థింకింగ్ ఒకటి. ప్రస్తుతం ఈ అతి ఆలోచనా ధోరణే చాలా మంది యువతీ యువకులకు మనశ్శాంతి లేకుండా చేస్తోందని నిపుణులు చెబుతున్నారు. చదువు, ఉద్యోగం, జీవితం, రోజువారీ కార్యకలాపాలు ఇలా ప్రతీ విషయంలోనూ మంచీ చెడూ, పాజిటివ్, నెగెటివ్ ఉంటాయి. ఈ క్రమంలో నెగెటివ్‌ను ఎక్కువగా స్వీకరించడం, ఆలోచించడం వల్ల కలిగే ప్రతికూల ధోరణుల్లో ఓవర్ థింకింగ్ కూడా ఒకటి. ఇది మీలో నిరాశా నిస్పృహ, ఆందోళన, ఒత్తిడికి కారణం అవుతుంది. ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. సక్సెస్ సాధించడానికి ఆటంకంగా మారుతుంది. కొత్త సంవత్సరంలో మీరు ఇలాంటి అడ్డంకులేవీ ఉండకూడదనుకుంటున్నారా? అయితే మీరు చేయాల్సిన అత్యంత ముఖ్యమైన పని ఏంటంటే... ఓవర్ థింకింగ్ వదిలేయండి. స్వీయ సంరక్షణ ముఖ్యం లైఫ్‌లో సంతోషంగా ఉండాలంటే సెల్ఫ్ కేర్ చాలా ముఖ్యం. అయితే ఉరుకులూ పరుగుల జీవితంలో కొందరు దీనిపై శ్రద్ధ చూపరు. సమయానికి తినకపోవడం, నిద్రను త్యాగం చేయడం, అనారోగ్యాలు వచ్చినప్పుడు కూడా తర్వాత చూద్దాం లే అనుకొని కేర్ తీసుకోకపోవడం వంటి నిర్లక్ష్యాలు అలా జరిగిపోతూనే ఉంటాయి. కానీ అవే తర్వాత సమస్యలుగా మారుతాయని గుర్తుంచుకోండి. అందుకే ఎంత బిజీగా ఉన్నా.. సమయానికి తిండి, సరైన నిద్ర, మెరుగైన ఆరోగ్యం ముఖ్యమని గుర్తుంచుకోండి. ఇవి మీలో ఒత్తిడిని తగ్గిస్తాయి. మానసిక దృఢత్వాన్ని పెంచుతాయి. గతాన్ని వదిలేద్దాం ప్రతి ఒక్కరికీ గత అనుభవాలు ఉంటాయి. అవి మీలో ఆనందాన్ని కలిగించేవిగానో, బాధన మిగిల్చినవిగానో ఉండవచ్చు. అయితే వాటిచుట్టే మీ ఆలోచనలు తిరుగుతుంటే భవిష్యత్‌లో మార్పు సాధ్యం కాదు. కాబట్టి కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టే ఈ తరుణంలో గత విషాదాలను, అనుభవాలను జ్ఞాపకాల డైరీలో భద్ర పరచండి. ఎందుకంటే మీరు వర్తమానంలో ఎదగాలంటే వాటిపై ఎక్కువగా ఫోకస్ చేయవద్దు అంటున్నారు నిపుణులు. పైగా అలా చేస్తే సమయం వృథా అవుతుంది. అంతేకాకుండా గత పొరపాట్లకు చింతిస్తూ కూర్చోవడం, మధురమైన పాతరోజుల కోసం ఆరాట పడుతూ బాధపడటం, వర్తమానాన్ని పట్టించుకోవడం మీ ఎదుగుదలకు అడ్డంకిగా మారుతుంది. కాబట్టి గతాన్ని ఒక జ్ఞాపకంగా ఉండనివ్వండి. వర్తమానంలో జీవించండి. అప్పుడే మీరు దృఢంగా తయారవుతారు. సంతోషంగా ఉంటారు. సమస్యలకు భయపడకండి జీవితం ఎల్లప్పుడూ కంఫర్ట్‌గానే ఉండాలని భావిస్తుంటారు చాలా మంది. కానీ అది ఎవరికీ సాధ్యం కాదు. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సందర్భంలో, ఏదో విషయంలో సమస్యలు, సవాళ్లు ఎదురవుతుంటాయి. కొందరు వీటికి భయపడి అవకాశాలను కోల్పోతుంటారు. లక్ష్యాలను విస్మరిస్తుంటారు. ఇంకొందరైతే సవాళ్లను స్వీకరించకముందే భయంతో వాటిని నిరోధించే ప్రయత్నం చేస్తుంటారు. కానీ వృత్తిపరమైన, చదువుపరమైన సవాళ్లను అలా నిరోధించడం కరెక్ట్ కాదంటున్నారు నిపుణులు. వాటిని స్వీకరిస్తేనే మీలో ధైర్యం, ఆత్మ స్థైర్యం పెరుగుతాయి. కాబట్టి వదిలేయాల్సింది సమస్యలనో, సవాళ్లనో కాదు, వాటిని స్వీకరించలేని, ఎదుర్కోలేని భయాన్ని వదిలేయండి. సామాజిక సంబంధాలు ముఖ్యం మనకు చాలా తెలిసి ఉండవచ్చు. కానీ అన్నీ తెలుసు అనుకోవడం మాత్రం మూర?త్వం. ఎందుకంటే.. ఏ వ్యక్తి కూడా సర్వస్వం తెలిసిన వారిగా ఉండటం సాధ్యం కాదు. అనుభవాలు, అవగాహన, ప్రవర్తన, సమస్యలు, సవాళ్లు, ఆటంకాలు ఇలా రకరకాల సందర్భాల్లో నేర్చుకుంటూ ముందుకు సాగాల్సిందే. అయితే ఇలాంటి మానసిక బలం, ధైర్యం, ఆత్మ స్థైర్యం వంటివి ఒంటరిగా వృద్ధి చెందేవి కావు. సామాజిక సంబంధాలతో, అధ్యయనాలతో, పరిశీలనతో డెవలప్ అవుతాయి. కాబట్టి మీరు సామాజిక సంబంధాలను ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయవద్దు. 2026లో మీరు సక్సెస్ ఫుల్ పర్సన్ కావాలంటే సమగ్ర అధ్యయనం, సామాజిక పరిశీలన, సోషల్ కనెక్షన్స్ ముఖ్యమని గుర్తించండి. పగ, ప్రతీకారం, జెలసీ అసలైన శత్రువులు జీవితంలో మీకు నష్టం చేసే విషయాల్లో పగ, ప్రతీకారం, జెలసీ వంటివి కూడా ఉన్నాయి. నిజానికి ఇవి ఇతరులను నష్టపరిచేందుకు కొందరు ఉపయోగించుకునే చెడు అలవాట్లు లేదా ప్రవర్తనగా నిపుణులు పేర్కొంటారు. అంతేకాదు వీటిని కలిగి ఉన్నవారు ఇతరులకు జరిగే నష్టంకంటే, తాము పొందే స్వీయ నష్టం అధికంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. నచ్చని విషయాలను మనసులో పెట్టుకోవడం, నచ్చని వారికి నష్టం చేయడమే లక్ష్యంగా నడుచుకునే క్రమంలో తమ పని, తమ అభివృద్ధి, తమ కుటుంబం వంటి విషయాలపై తక్కువ ఫోకస్ చేస్తారు. చివరికి స్వీయ అపరాధ భావనకు గురౌతారు. పైగా పగ, ప్రతీకారం, జెలసీ వంటివి పరిపూర్ణ వ్యక్తిత్వానికి ప్రతిబింబం కావు. పిరికి మనస్తత్వానికి నిదర్శనంగా నిపుణులు పేర్కొంటున్నారు. కాబట్టి కొత్త సంవత్సరంలో మీరు వదిలేయాల్సిన అత్యంత ముఖ్యమైన విషయాలు పగ, ప్రతీకారం, జెలసీ కూడా అనేది గుర్తుంచుకోండి. మార్పు పట్ల భయం వద్దు చాలా మంది చేసే పొరపాటు ఏంటంటే.. మార్పును వెంటనే స్వీకరించరు. ఎందుకంటే సహజంగానే మనంరొటీన్‌కు అలవాటు పడిపోతుంటాం. అందుకే మార్పు అంటే వెంటనే రుచించదు. దానివల్ల కలిగే సానుకూల అంశాలకంటే.. ప్రతికూలతలే ఎక్కువగా వెతుకుతుంటాం. అయితే మార్పు అనేది మీకు నష్టం చేసేది అయినప్పుడు మారాల్సిన అవసరం లేదు. కానీ మీ జీవితానికి మేలు చేసేదైతే ఎందుకు ఆహ్వానించకూడదు అంటున్నారు నిపుణులు. కాలంతోపాటు మీరు మారనంత వరకు సమస్యల సుడిగుండంలో పడి కొట్టు మిట్టాడుతూనే ఉంటారు. అందుకే మార్పును గుడ్డిగా వ్యతిరేకించకండి. మీరు దృఢత్వమైన మనస్తత్వం గల మనుషులుగా తయారు కావాలంటే మంచి కోసం మారే అవకాశాలను చేజార్చుకోవద్దు. 2026లో కూడా అలా ఉండాలని గట్టిగా డిసైడ్ అయిపోండిక.

# టెస్టులకు రిటైర్మెంట్ ఇస్తాడా?.. అదే తెలివైన నిర్ణయం!



ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు ఆస్ట్రేలియా పేసర్ జోష్ హాజిల్‌వుడ్. గాయం కారణంగా మరికొన్ని వారాల పాటు ఆటకు దూరం కానున్నాడు. 34 ఏళ్ల ఈ ఆసీస్ ఫాస్ట్‌బౌలర్.. స్వదేశంలో జరిగిన గత 25 మ్యాచ్‌లలో 15 గాయాల వల్ల మిస్సయ్యాడు. ఇప్పుడు తాజాగా ఇంగ్లండ్‌తో యాషెస్ టెస్టులకూ హాజిల్‌వుడ్ అందుబాటులో లేకుండా పోయాడు. తన కెరీర్‌లో ఇప్పటికి 76 టెస్టులు ఆడిన హాజిల్‌వుడ్.. 295 వికెట్లు కూల్చాడు. అయితే, మూడు వందల వికెట్ల అరుదైన క్లబ్‌లో ఇప్పట్లో చేరడం కాస్త కష్టంగానే కనిపిస్తోంది. వేధిస్తున్న గాయాలు కెరీర్ ఆరంభం నుంచి అద్భుతంగా ఆకట్టుకున్న హాజిల్‌వుడ్.. స్వదేశంలో, విదేశాల్లో తనదైన శైలిలో రాణించాడు. అయితే, ముందుగా చెప్పినట్లు గత కొన్నాళ్లుగా అతడి టెస్టుల్లో రోజుల తరబడి బౌలింగ్ చేసేందుకు సహకరించడం లేదు. పక్కటెముకల నొప్పులు, వెన్నునొప్పి, తొడ కండరాల గాయాలు తరచూ అతడిని వేధిస్తున్నాయి. తాజాగా చీలమండ వెనుక భాగం నొప్పి తీవ్రం కావడంతో హాజిల్‌వుడ్ యాషెస్ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. రేసులో వారంతాగత ఐదు వేసవి సీజన్లలో ఆసీస్ ఆడిన ఇరవై టెస్టుల్లో హాజిల్‌వుడ్ పది మాత్రమే ఆడాడు. నైపుణ్యాల పరంగా రోజురోజుకీ మరింత మెరుగుపడుతున్నప్పటికీ గాయాల బెడద వల్ల అతడి టెస్టు కెరీర్ ముందుగానే ముగింపు దశకు చేరుకునేలా ఉంది. హాజిల్‌వుడ్ స్థాయిలో కాకపోయినా.. స్కాట్ బోలాండ్, మైఖేల్ నెసర్, బ్రెండన్ డాగెట్, జేవియర్ బార్ట్‌లెట్, సీన్ అబాట్ వంటి పేసర్లు సత్తా చాటుతూ తమను తాము నిరూపించుకుంటున్నారు. టెస్టులకు రిటైర్మెంట్ ఇస్తాడా? ఇలాంటి తరుణంలో గాయాల వల్ల హాజిల్‌వుడ్ తరచూ జట్టుకు దూరం కావడం.. అతడి కెరీర్‌పై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. టెస్టుల సంగతి పక్కనపెడితే.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో హాజిల్‌వుడ్‌కు తిరుగులేదన్నది వాస్తవం. ప్రపంచస్థాయి టీ20 అత్యుత్తమ బౌలర్లలో ఒకడిగా అతడు కొనసాగుతున్నాడు. ఆసీస్ 2021లో తొలిసారి టీ20 ప్రపంచకప్ గెలవడంలో హాజిల్‌వుడ్‌దీ కీలక పాత్ర. వన్డేల్లోనూ అతడికి మంచి రికార్డు ఉంది. వన్డే వరల్డ్‌కప్-2027లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగే ఆస్ట్రేలియాకు అతడి సేవలు అత్యంత ముఖ్యం. తెలివైన నిర్ణయం తీసుకుంటేనే ఈ పరిణామాలను బట్టి ఫిట్‌నెస్, వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ దృష్ట్యా హాజిల్‌వుడ్ టెస్టులకు వీడ్కోలు పలికి.. మిగిలిన రెండు ఫార్మాట్లలో కొనసాగితే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సంప్రదాయ ఫార్మాట్‌కు స్వస్తి పలికి టీ20, వన్డేలలో పూర్తిస్థాయిలో సేవలు అందిస్తేనే కెరీర్‌కు మరికొన్నాళ్లపాటు ఢోకా ఉండదని విశ్లేషకులు అంటున్నారు. అయితే, పూర్తిగా టెస్టులకు వీడ్కోలు పలకపోయినా.. కొన్నాళ్ల పాటు ఆ ఫార్మాట్‌కు దూరంగా ఉంటే పరిస్థితి చక్కబడవచ్చని మరికొందరు పేర్కొంటున్నారు. ఏదేమైనా ఇప్పటికే టెస్టుల్లో తానేంటో నిరూపించుకున్న హాజిల్‌వుడ్.. కెరీర్ కొనసాగింపులో భాగంగా ఈ దశలో తెలివైన నిర్ణయం తీసుకుంటేనే అంతా సజావుగా సాగిపోతుందని మెజారిటీ మంది అభిప్రాయం. అయితే, హాజిల్‌వుడ్ మాత్రం తనలో ఇంకా మూడు ఫార్మాట్లు ఆడే సత్తా ఉందని పేర్కొనడం కొసమెరుపు.

# బిజీ లైఫ్‌లో సంతోషంగా ఉండాలంటే..? ఈ టిప్స్ ఫాలో కావాల్సిందే!!



మార్నింగ్ నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే దాకా బిజీ బిజీగా గడిపేస్తుంటారు చాలామంది. ఇటు కుటుంబ బాధ్యతలు, అటు కెరీర్ పరంగా ఎదురయ్యే సవాళ్ల నడుమ సతమతం అవుతుంటారు. కొన్ని ప్రాబ్లమ్స్ కామనే అయినప్పటికీ కొందరు మరీ భూతద్దంలో పెట్టి చూస్తుంటారు. దీనివల్ల నిరుత్సాహం, నిరాశ ఎదురవుతుంటాయి. క్రమంగా ఫిజికల్ హెల్త్‌పై కూడా ఎఫెక్ట్ చూపుతుంటాయి. అయితే ఇలాంటి పరిస్థితుల నుంచి బయటపడేసి మిమ్మల్ని ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండేలా సహాయపడే టిప్స్ కొన్ని ఉన్నాయంటున్నారు నిపుణులు. అవేమిటో చూద్దాం. ఫిజికల్ యాక్టివిటీస్ క్రమం తప్పకుండా వ్యాయామాలు లేదా ఏదో ఒకరకమైన ఫిజికల్ యాక్టివిటీస్ కలిగి ఉండటం మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. తద్వారా ఆనందంగా, ఉత్సాహంగా ఉండగలుగుతారని ఫిట్‌నెస్ నిపుణులు చెబుతున్నారు. జిమ్‌లో చేసే వర్కౌట్స్ మాత్రమే కాకుండా వాకింగ్, రన్నింగ్, స్విమ్మింగ్, మెడిటేషన్ వంటివి డైలీ అరగంట ప్రాక్టీస్ చేస్తే బీజీ లైఫ్ నుంచి బిగ్ రిలీఫ్ పొందుతారని నిపుణులు సూచిస్తున్నారు. ఎమోషనల్ కంట్రోలింగ్ భావోద్వేగాలను నియంత్రించుకోలేకపోవడం అనేక సమస్యలకు దారితీస్తుంది. ముఖ్యంగా కోపం, ఆవేశం, అతి ఆలోచనలు, ప్రతికూల ఆలోచనలు అధికం అవుతాయి. వాటిని అధిగమించి మీరు ఉత్సాహంగా ఉండటంలో యోగా అద్భుతంగా సహాయపడుతుందని ఫిట్‌నెస్ నిపుణులు అంటున్నారు. ప్రతి రోజూ కొంతసేపు ప్రాక్టీస్ చేస్తే మీలోని ప్రతికూల భావాలు తగ్గుతాయి. భావోద్వేగాలు నియంత్రణలో ఉంటాయి. కాసేపు ఒంటరిగా.. ఒంటరి తనం వేరు.. ఒంటరిగా కాసేపు గడపడం వేరు. ఒంటరి తనం మానసిక సమస్యలకు దారితీయవచ్చు. కానీ అప్పుడప్పుడు ఎవరూలేని ఏకాంత ప్రదేశంలో కాసేపు ఒంటరిగా కూర్చొని రిలాక్స్ అవ్వడం మీకు మేలు చేస్తుంది. అలా నిశ్శబ్ద వాతావరణంలో మీకు మీరు మనసులో ప్రశ్నించుకోవడం, మాట్లాడుకోవడం, లోతుగా ఆలోచించడం చేస్తారు. దీనివల్ల మీరు ఎదర్కొనే సమస్యకు పరిష్కారాలు కూడా లభిస్తాయి. ఒత్తిడి, ఆందోళనలు వంటివి దూరం అవుతాయి. కాబట్టి రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండాలంటే రోజూ ఉదయం లేదా సాయంకాలం కాసేపు మీకంటూ సమయం కేటాయించుకోండి. ఉదయమో, సాంయత్రమో నిశ్శబ్దంగా ప్రకృతిని ఆస్వాదించండి. నాణ్యమైన నిద్ర : చాలా సమస్యలు నిద్రలేమితో ముడిపడి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే సరిగ్గా నిద్రపోకపోతే మరుసటి రోజు మీ పనిలో దాని ప్రభావం కనిపిస్తుంది. ప్రొడక్టివిటీ తగ్గవచ్చు. దీర్ఘకాలంపాటు నిద్రలేమిని ఎదుర్కొనేవారు మానసిక, శారీరక అనారోగ్యాల బారిన పడే అవకాశం ఎక్కువ. కాబట్టి మీరు ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండాలంటే మీరు ఏ సమయంలో నిద్రపోయినా అది నాణ్యమైనదిగా ఉండే వాతావరణం క్రియేట్ చేసుకోవడం బెటర్. పాజిటివ్ థింకింగ్ మీ ఆలోచన ఎలా ఉంటే చాలా విషయాలు అందుకు అనుగుణంగానే జరిగే అకాశం ఉంటుంది అంటారు నిపుణులు. కాబట్టి వీలైనంత వరకు ప్రతీ విషయంలో సానుకూలంగా ఉండేలా చూసుకోండి. సానుకూల ఆలోచనలు మీలో ఆనందాన్ని, ఉత్సాహాన్ని నింపుతాయి. ప్రతి కూల ఆలోచనలు ఎక్కువైతే నిరాశ, నిస్పృహలకు దారితీస్తాయి. కాబట్టి పాజిటివ్‌గా ఆలోచించడం, పాజిటివ్‌గా అలవాటు చేసుకుంటే మీ జీవితం కూడా ఎక్కువగా అదే మార్గంలో సాగే చాన్స్ ఉంటుందని సైకాలజిస్టులు అంటున్నారు.

కృతజ్ఞతగా ఉండటం.. మనం హ్యాపీగా ఉంటున్నామంటే అందుకు బయటి పరిస్థితులు, వ్యక్తులు, ప్రకృతి, వనరులు ఇలా అనేక కారణాలు ఉంటాయి. అందుకే మీరు వాటన్నింటిపట్ల కృతజ్ఞతా భావంతో ఉండాలంటారు నిపుణులు. ఇలా ఉండటం మీలో స్వీయ ఆనందానికి దారితీస్తుంది. మీకు మేలు చేసిన వ్యక్తులను, పరిసరాలను, పరిస్థితులను సందర్భం వచ్చినప్పుడు గుర్తు చేసుకోవడం, కృతజ్ఞతగా ఫీలవడం మీలో హ్యాపీ హార్మోన్ల విడుదలకు కారణం అవుతుంది. మీలో రెట్టింపు ఉత్సాహాన్ని నింపుతుంది.



# బ్లాక్ డ్రెస్?లో శోభిత.. మోడ్రన్ లుక్?లో స్టన్నింగ్!



గూఢచారి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరై, ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు శోభిత ధూళిపాళ. కేవలం సినిమాలతోనే కాకుండా, తన యూనిక్ ఫ్యాషన్ సెన్స్?తో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటారు. లేటెస్ట్ గా ఈ బ్యూటీ ఇన్?స్టాగ్రామ్?లో షేర్ చేసిన కొత్త ఫొటోలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్?గా మారాయి. ఈ లేటెస్ట్ ఫొటోషూట్?లో శోభిత నలుపు రంగు స్టైలిష్ డ్రెస్?లో మెరిసిపోతున్నారు. స్లీవ్?లెస్?గా, హై నెక్?తో డిజైన్ చేసిన ఈ అవుట్?ఫిట్ ఆమె పర్ఫెక్ట్ గ్లామర్ ?ను ఎలివేట్ చేస్తోంది. నడుము భాగంలో వచ్చిన కట్?అవుట్స్, అక్కడ మెరుస్తున్న సన్నని సిల్వర్ చైన్ డీటైలింగ్ ఈ డ్రెస్?కు మరో హైలెట్. సింపుల్?గా కనిపిస్తూనే ఎంతో స్టైలిష్?గా ఉన్న ఈ లుక్ ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటోంది. జాంబీ కథలో రణ్‌వీర్.. ముందుంది ముసళ్ల పండగ! "ప్రతి సీజన్?కు మోడ్రన్ పాలిష్" అంటూ ఆమె ఇచ్చిన క్యాప్షన్ ఆమె అప్పియరెన్స్?కు సరిగ్గా సరిపోయింది. హెవీ మేకప్ జోలికి వెళ్లకుండా, స్టన్నింగ్ లుక్?తో చాలా క్లాసీగా కనిపిస్తున్నారు. చెవులకు పెద్ద క్రిస్టల్ ఇయర్ రింగ్స్ మినహా వేరే ఆభరణాలు ఏమీ లేకుండానే ఇంత గ్రాండ్?గా కనిపించడం ఒక్క శోభితకే సాధ్యం అనిపిస్తోంది. అక్కినేని నాగచైతన్యతో పెళ్లి తర్వాత శోభిత క్రేజ్ మరింత పెరిగింది. కెరీర్ పరంగానూ ఫుల్ బిజీగా గడుపుతున్నారు. 'మంకీ మ్యాన్'తో హాలీవుడ్?లోనూ సత్తా చాటిన ఆమె, ఎప్పుడూ వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. సాధారణంగా బ్లాక్ డ్రెస్ అంటేనే ఒక ప్రత్యేకమైన ఆకర్షణ ఉంటుంది. అందులోనూ శోభిత వంటి ఫ్యాషబ్ గర్ల్ ధరిస్తే ఆ లుక్ నెక్స్ట్ లెవెల్?లో ఉంటుంది. గోడకు ఆనుకుని ఆమె ఇచ్చిన ఫోజులు, ఆ లుక్స్ చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. రాబోయే రోజుల్లో వెండితెరపై ఆమె ఇంకా ఎలాంటి గ్లామర్ తో ఆకట్టుకుంటారో చూడాలి.

# జాంబీ కథలో రణ్‌వీర్.. ముందుంది ముసళ్ల పండగ!



దాదాపు అరడజను పైగా ఫ్లాపులు ఎదుర్కొన్న తర్వాత రణ్ వీర్ సింగ్ తన కెరీర్ బెస్ట్ హిట్ చిత్రంలో నటించాడు. దాదాపు అరడజను పైగా ఫ్లాపులు ఎదుర్కొన్న తర్వాత రణ్ వీర్ సింగ్ తన కెరీర్ బెస్ట్ హిట్ చిత్రంలో నటించాడు. %-%దురంధర్%-% అతడి ఫేట్‌ని మార్చేసింది. ఈ సినిమా పాన్ ఇండియాలో బిగ్గెస్ట్ హిట్ కొట్టి చిత్రబృందంలో గొప్ప ఉత్సాహాన్ని నింపింది. ముఖ్యంగా రణ్ వీర్ కి కెరీర్ పరంగా బిగ్ బూస్ట్ ఇచ్చిందని చెప్పాలి. అందుకే ఇప్పుడు రణ్ వీర్ సింగ్ కొత్త జానర్లతో ప్రయోగాలకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. అతడు ఈసారి రొటీన్ సినిమాలో నటించడు. సాహసోపేతమైన ఒక విభిన్నమైన జానర్ ని ఎంపిక చేసుకున్నాడు. ఈ సినిమా కథాంశం చాలా ఎగ్జయిట్ చేస్తుందని చెబుతున్నారు. కథాంశం ప్రకారం.. ఇది పోస్ట్-అపోకలిప్టిక్ జోంబీ థ్రిల్లర్. ప్రస్తుతం %-%డాన్ 3%-% చిత్రీకరణలో బిజీగా ఉన్న రణ్ వీర్ తదుపరి జోంబీ మూవీ కోసం కాల్షీట్లు కేటాయిస్తారు. 2026 ఆగస్టుకు ముందు ఈ చిత్రం సెట్స్ పైకి వెళ్లే ఛాన్సుంది. 2026 లో 1000 కోట్ల తెలుగు సినిమా? నిజానికి భారతదేశంలో జోంబి కథలకు ఆదరణ దక్కుతుందా? అంటే.. ఇది కచ్చితంగా పెద్ద దుస్సాహసమనే అంగీకరించాలి. ఇప్పటి వరకూ జాంబి కథలతో రూపొందించిన ఏ భారతీయ సినిమా ఆశించిన విజయాలను అందుకోలేదు. విమర్శకులు కంటెంట్ బావుంది అని చెప్పినా కానీ, ఇలాంటి సినిమాలకు జనం థియేటర్లకు క్యూ కట్టలేదు. అయితే ఏ నటుడు అయినా ప్రయోగాలు చేసినప్పుడే అతడిలోని అసలైన ఎనర్జీ, ప్రతిభ బయటపడుతుంది. ప్రస్తుతం రణ్ వీర్ రొటీన్ కి భిన్నంగా ఆలోచిస్తున్నాడు. తీవ్రవాదం, దేశభక్తి, రాజకీయాల నేపథ్యంలో రూపొందించిన దురంధర్ విజయం అతడికి బిగ్ బూస్ట్ ఇచ్చింది. ఇకపై మరిన్నిప్రయోగాలకు శ్రీకారం చుట్టేందుకు ఇది ఆరంభం మాత్రమే. దురంధర్‌లో డార్క్ షేడ్ ఉన్న స్పై పాత్రలో నటించిన రణ్ వీర్ తదుపరి సినిమాలో అందుకు పూర్తి భిన్నంగా కనిపించనున్నాడు. త్రయం.. మాటల్లేవ్ మాట్లాడుకోడాల్లేవ్!? ఎంపిక చేసుకున్న జాంబీ కథాంశం ప్రకారం..ముంబై నేపథ్యంలో పోస్ట్ అపోకలిప్టిక్ ఎరాను క్రియేట్ చేయబోతున్నారని, దీనికోసం భారీ సెట్లు నిర్మిస్తున్నారని కూడా కథనాలొస్తున్నాయి. కృత్రిమ మేథస్సు (ఏఐ)ను ఉపయోగించి కూడా విజువల్స్ ని సృష్టిస్తారు. నిర్జనంగా ఎప్పుడో దశాబ్దాల క్రిత ఖాళీ చేసి వెళ్లిపోయిన పాత కాలపు ముంబైని సెట్లలో నిర్మించాల్సి ఉంది. ఈ నగరంలో జోంబీలతో ఒంటరి పోరాటం సాగించేవాడిగా రణ్ వీర్ సింగ్ కనిపిస్తాడు. జాంబీలు గుంపులుగా వెంటాడుతుంటే వాటిని తప్పించుకుని తిరిగే శక్తివంతమైన యువకుడిగా అతడు కనిపిస్తాడు. అయితే ఇలాంటి సినిమాల్లో కథానాయకుడిగా నటించేందుకు స్కోప్ ఎక్కువగా ఉంటుంది. అలాగే భిన్నమైన భావోద్వేగాలను పలికించవచ్చు. అయితే నిర్జన ప్రదేశంలో జాంబీలతో పోరాడే యువకుడి కథతో దశాబ్దాల క్రితమే %-%ఐ యామ్ లెజెండ్%-% విడుదలైంది. విల్ స్మిత్ నటించిన ఈ సినిమా సంచలన విజయం సాధించింది. ఆ సినిమా ఇప్పటికీ ఒక అద్భుతం. కానీ ఇప్పుడు రణ్ వీర్ అంతకుమించి చేసి చూపించాల్సి ఉంటుంది.

# జైలర్ ఆధిపత్యానికి దురంధర్ బ్రేకులు?



రెండు పెద్ద సినిమాలు ఒకే తేదీకి విడుదలైతే ఆ రెండిటి రచ్చ మామూలుగా ఉండదు. అగ్ర హీరోల సినిమాలు క్లాష్ అయితే ఆ రెండిటికీ నష్టం తప్పదు. ఓపెనింగులు ఘోరంగా పడిపోతాయి. ఆ తర్వాత నెగెటివ్ టాక్ వచ్చిన సినిమా పూర్తిగా నాశనమవుతుంది. అందుకే ఎవరూ సాహసించి వేరొకరితో పోటీపడి బరిలో దిగాలని అనుకోరు. కానీ ఇప్పుడు సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమా అలాంటి అనూహ్య పరిస్థితిని ఎదుర్కోనుంది. రజనీకి తమిళనాడు, తెలుగు రాష్ట్రాలలో ఎవరూ పోటీ కాదు. కానీ ఉత్తరాదిన రజనీ నటించిన సినిమాకు గట్టి పోటీ ఎదురవ్వనుంది. మరింత డీటెయిల్డ్ గా వివరాల్లోకి వెళితే.. 2026 లో 1000 కోట్ల తెలుగు సినిమా? రజనీ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించనున్న జైలర్ 2 ని 2026 ఆగస్టు 14న విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. జైలర్ బ్లాక్ బస్టర్ విజయం సాధించిన నేపథ్యంలో జైలర్ 2 ని కూడా అంతే ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న నిర్మాతలు భారీగా రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నట్టు తెలిసింది. అయితే జైలర్ దూకుడుకు దురంధర్ బ్రేక్ వేస్తాడని భావిస్తున్నారు. రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా ఆదిత్యాధర్ తెరకెక్కించిన దురంధర్ గ్రాండ్ సక్సెస్ సాధించిన నేపథ్యంలో ఈ సినిమా సీక్వెల్ ని అత్యంత భారీగా తెరకెక్కించాలని నిర్మాతలు భావిస్తున్నారు. దీంతో మార్చిలో రిలీజ్ కావాల్సిన దురంధర్ 2 ఆగస్టులో స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా విడుదలకు వెళుతోంది. దురంధర్ అనూహ్యమైన విజయం సాధించింది. ఇది రెండో వారంలోను స్థిరమైన వసూళ్లను సాధిస్తూ ఆశలు రేకెత్తించింది. ఇప్పటికే 300 కోట్లు అధిగమించి 500 కోట్ల క్లబ్ దిశగా సాగుతోందని ట్రేడ్ విశ్లేషిస్తోంది. దురంధర్ విజయం నేపథ్యంలో రెండో భాగాన్ని అత్యంత భారీగా రూపొందించాలని దర్శకనిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. పుష్ప విజయం తర్వాత పుష్ప 2 కోసం ఎలాంటి మార్పులు చేయాలనుకున్నారో, అలాంటి ప్రయత్నమే ఇప్పుడు %-%దురంధర్ 2%-% విషయంలోను జరగనుంది. త్రయం.. మాటల్లేవ్ మాట్లాడుకోడాల్లేవ్!? అయితే దీనికోసం మేకర్స్ కి అదనపు సమయం కావాలి. అందుకే మార్చి నుంచి ఆగస్టుకు రిలీజ్ తేదీని వాయిదా వేసారని గుసగుసలు వినిపిస్తున్నాయి. కొత్త డేట్ వస్తే, అదనంగా మరో 4 నెలల సమయం అందుబాటులో ఉంటుంది. థియేట్రికల్ గా ఘనవిజయం సాధించిన ఈ సినిమాని ఓటీటీల్లోను పోటీపడి వీక్షిస్తారని కూడా అంచనా వేస్తున్నారు. ఓవరాల్ గా దురంధర్ పార్ట్ 2 పై మరింత ఆసక్తి పెరగనుంది. ఈ ఏడాది ఆగస్టులో వార్ 2, కూలీ విడుదల కాగా కూలీ బాక్సాఫీస్ వద్ద హవా సాగించింది. %-%వార్ 2%-% రకరకాల కారణాలతో కాస్ట్ ఫెయిల్యూర్ గా మారింది.

**అయితే దీనికోసం మేకర్స్ కి అదనపు సమయం కావాలి. అందుకే మార్చి నుంచి ఆగస్టుకు రిలీజ్ తేదీని వాయిదా వేసారని గుసగుసలు వినిపిస్తున్నాయి.**



# మంచు మనోజ్‌కు రామ్ చరణ్ ఓకే చెబుతాడా?

ఒకప్పుడు టాలీవుడ్ బిజీ హీరోల్లో ఒకడిగా ఉండేవాడు మంచు మనోజ్. అప్పుడప్పుడు హిట్లు కూడా కొడుతుండేవాడు. మంచు కుటుంబంలో అత్యధిక సక్సెస్‌లు సాధించింది కూడా అతనే. కానీ ఉన్నట్లుండి తన కెరీర్లో బాగా గ్యాప్ వచ్చేసింది. వరుస ఫ్లాపులు, వ్యక్తిగత జీవితంలో ఒడుదొడుకుల వల్ల ఐదారేళ్ల పాటు తన నుంచి సినిమానే రాలేదు. అసలు సినిమాల్లో నటించకుండా ఇండస్ట్రీకే దూరం అయిపోయినట్లు కనిపించాడు. కానీ గత ఏడాది అతను మళ్లీ ముఖానికి రంగేసుకున్నాడు. ఈ ఏడాది మనోజ్ సినిమాలు రెండు రిలీజయ్యాయి. తన రీఎంట్రీ మూవీ భైరవం ఫ్లాప్ అయినప్పటికీ.. మిరాయ్ మాత్రం బ్లాక్ బస్టర్ అయింది. ఈ రెండు చిత్రాల్లోనూ అతను చేసింది విలన్ పాత్రలే కావడం విశేషం. ముఖ్యంగా మిరాయ్‌లో ఫుల్ లెంగ్త్ నెగెటివ్ రోల్ చేసి మెప్పించాడు. దీంతో టాలీవుడ్‌కు సరైన విలన్ దొరికాడనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అలా అని మనోజ్ నెగెటివ్ రోల్స్‌కే పరిమితం కావట్లేదు. 2026 లో 1000 కోట్ల తెలుగు సినిమా? డేవిడ్ రెడ్డి పేరుతో హీరోగా ఒక సినిమాను మనోజ్ అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. ఐతే ఇంకా ఈ మూవీ షూటింగ్ మొదలు కాలేదు. త్వరలోనే సెట్స్ మీదికి వెళ్లనున్న ఈ చిత్రంలో రెండు స్పెషల్ క్యామియో రోల్స్ ఉన్నాయట. అందులో ఒకటి మంచు మనోజ్ క్లోజ్ ఫ్రెండ్ అయిన తమిళ స్టార్ హీరో శింబు చేయనున్నాడట. ఇంకో పాత్ర కోసం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌ను అడుగుతున్నట్లు సమాచారం. చరణ్‌తో మనోజ్‌కు మంచి స్నేహమే ఉంది. కానీ పాన్ ఇండియా స్థాయిలో పెద్ద స్టార్‌గా ఎదిగిన చరణ్.. కెరీర్లో ఈ దశలో మనోజ్ సినిమాలో క్యామియో రోల్ చేస్తాడా అన్నది సందేహం. పాత్ర చాలా బాగుంటే, తన ఇమేజ్‌ను దెబ్బ తీయదనుకుంటే.. మనోజ్ కెరీర్‌కు ఈ సినిమా బాగా ఉపయోగపడుతుందంటే ఆలోచించవచ్చు. డేవిడ్ రెడ్డి ఒక పీరియడ్ ఫిలిం. ఇది బ్రిటిష్ వాళ్ల మీద పోరాడిన ఒక యోధుడి కథ ఇదట. హనుమరెడ్డి యక్కంటి అనే కొత్త దర్శకుడు ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాడు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందనున్న ఈ చిత్రానికి పేరున్న టెక్నీషియన్లు పని చేయనున్నారు.

# 2026 లో 1000 కోట్ల తెలుగు సినిమా?

**బాహుబలి ఆర్ ఆర్ ఆర్ పుష్ప కల్కి 2898 లాంటి చిత్రాలు 1000 కోట్లకు పైగా వసూళ్లు సాధించడంతో? ఇండియన్ బాక్సాఫీస్ వద్ద టాలీవుడ్ యావరేజ్ టార్గెట్ 2000 కోట్లగా మారింది.**

1000 కోట్ల క్లబ్ అన్నది టాలీవుడ్ కి ఇప్పుడు కామన్ గా మారిన పదం. బాహుబలి ఆర్ ఆర్ ఆర్ పుష్ప కల్కి 2898 లాంటి చిత్రాలు 1000 కోట్లకు పైగా వసూళ్లు సాధించడంతో? ఇండియన్ బాక్సాఫీస్ వద్ద టాలీవుడ్ యావరేజ్ టార్గెట్ 2000 కోట్లగా మారింది. ఎస్ ఎస్ ఎంబీ 29 వారణాసి బన్నీ 26వ చిత్రాలైతే? అంతకు మించే హైప్ తీసుకొ స్తున్నాయి. రెండు సినిమాల టార్గెట్ 3000 కోట్ల టార్గెట్ గా బరిలోకి దిగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. త్రయం.. మాటల్లేవ్ మాట్లాడుకోడాల్లేవ్!? ఆ సంగతి పక్కన బెడితే? 2025 లో మాత్రం టాలీవుడ్ నుంచి 1000 కోట్ల వసూళ్ల సినిమా ఒకటీ లేదు. సంక్రాంతి తర్వాత అన్నీ చప్పగానే రామ్ చరణ్ నటించిన %-%గేమ్ ఛేంజర్%-% భారీ అంచనాల మధ్య పాన్ ఇండియాలో రిలీజ్ అయినా? ఆశించిన ఫలితాలు రాలేదు. ఆ తర్వాత మరే చిత్రం కూడా ఆ రేంజ్ లో రిలీజ్ అవ్వలేదు. చాలా సినిమాలు రీజనల్ మార్కెట్ కే పరిమితమయ్యాయి. వీటిలో పెద్ద విజయం సాధించిన చిత్రమేది? అంటే %-%సంక్రాంతికి వస్తున్నాం%-% ఒకటి కనిపిస్తుంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద 300 కోట్ల వసూళ్లను సాధించింది. ఇదేమీ పాన్ ఇండియా రిలీజ్ కాదు. రీజనల్ మార్కెట్ కే పరిమితమైన చిత్రం. అయినా వెంకీ ఇమేజ్ అనీల్ మార్క్ ఎంటర్ టైనర్ కావడంతో? కనెక్ట్ అయింది. పూరి తర్వాత ఆ రికార్డు అనీల్ దే! ప్రభాస్ రెండు సినిమాలతో: మరి 2026 లో టాలీవుడ్ నుంచి 1000 కోట్లు సాధించే సత్తా ఉన్న చిత్రాలేంటి? అంటే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తోన్న %-%పెద్ది%-%పై అంచనాలున్నాయి. మార్చిలో ఈ సినిమా పాన్ ఇండియాలో రిలీజ్ అవుతుంది. అంతకు ముం దే? డార్లింగ్ ప్రభాస్ నటిస్తోన్న %-%ది రాజాసాబ్%-% సంక్రాంతి కానుకగా రిలీజ్ అవుతుంది. మారుతి దర్శకత్వం వహిస్తోన్న సస్పెన్స్ కామెడీ థ్రిల్లర్ ఇది. ప్రభాస్ ఇమేజ్ ని దృష్టిలో పెట్టుకుని పాన్ ఇండియాలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు. ఇప్పటికే ప్రచారం పనులు కూడా మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. లిరిసిస్ట్ నుంచి బ్లాక్ బస్టర్ డైరెక్టర్ వరకు.. పెద్ది, పౌజీపై అంచనాలు: మరి ఈ సినిమా 1000 కోట్ల పోటీ బరిలో ఉందా? అంటే ఇప్పుడే చెప్పలేం. నార్త్ ఆడియన్స్ కు కంటెంట్ కనెక్ట్ అవ్వడాన్ని బట్టి ఉంటుంది. %-%పుష్ప%-%లా కనెక్ట్ అయిందంటే? మాత్రం వసూళ్లతో బాక్సాఫీస్ మోతెక్కడం ఖాయం. అదే ఏడాది ప్రభాస్ నటిస్తోన్న %-%పౌజీ%-% కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తో న్న చిత్రమిది. ఇదోక పీరియాడిక్ యాక్షన్ చిత్రం కావడంతో? ఇండియా వైడ్ అంచనాలైతే భారీగా ఉన్నాయి.%-%పెద్ది%-%ని మించిన అంచనాలు పౌజీ పై ఉన్నాయి. %కూశ్రీంశీ =ము౦% - వర్కింగ్ అవర్స్ విషయంలో దీపికాకు వ్యతిరేకంగా రణ్‌వీర్ గత గణాంకాలు ఆధారంగా: యూనివర్సల్ కాన్సెప్ట్ కావడంతో? బజ్ నెలకొంది. భారీ వార్ కథలోనే ఓ బ్యూటీఫుల్ లవ్ స్టోరీని కూడా తీసుకు న్నాడు. %-%సీతారామం%-% లాంటి పాన్ ఇండియా సక్సెస్ కూడా హను ఖాతాలో ఉన్న నేపథ్యంలో అంచనాలు రెట్టింపు అవుతు న్నాయి. అయితే టాలీవుడ్ నుంచి రిలీజ్ అవుతోన్న ఏ పాన్ ఇండియా సినిమా అయినా? నార్త్ బెల్ట్ నుంచి కచ్చితంగా 200 కోట్లకు పైగా వసూళ్లను రాబడితే? 1000 కోట్ల క్లబ్ అన్నది సాధ్యమని గత సినిమా గణాంకాలు చెబుతున్నాయి.



# కష్టాల్లో ఆ హీరోయిన్ సెకండ్ ఇన్నింగ్స్

అయితే ఎంత ఫోకస్ చేసినా వారికి అవకాశాలు తగ్గడమనేది మామూలే. ఒకప్పుడున్న క్రేజ్ ఇప్పుడు రావాలంటే రాదు.

హీరోయిన్లు అందరికీ సిల్వర్ స్క్రీన్ పై సెకండ్ ఇన్నింగ్స్ పెద్దగా వర్కవుట్ కాదు. ఒకవేళ మళ్లీ స్క్రీన్ పై కనిపించాలనుకున్నా, బిజీగా మారాలనుకున్నా సపోర్టింగ్ రోల్స్ తోనే సరిపెట్టుకోవాలి తప్పించి మళ్లీ ఒకప్పటిలా హీరోయిన్ పాత్రలే అంటే ఆ అవకాశం రాదు. కానీ చాలామంది మాత్రం రీఎంట్రీ టైమ్ లో కూడా హీరోయిన్ పాత్రలపైనే ఎక్కువ ఫోకస్ చేస్తుంటారు. అయితే ఎంత ఫోకస్ చేసినా వారికి అవకాశాలు తగ్గడమనేది మామూలే. ఒకప్పుడున్న క్రేజ్ ఇప్పుడు రావాలంటే రాదు. ఒకసారి గ్యాప్ వచ్చిందంటే ఆ గ్యాప్ అలానే ఉండిపోతుంది తప్పించి ఆ గ్యాప్ తగ్గిపోయి మళ్లీ బిజీ అవడం చాలా తక్కువ మంది విషయంలోనే జరుగుతుంది. ఇక అసలు విషయానికొస్తే టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ ఒకప్పుడు ఏ స్థాయి స్టార్‌డమ్ ను అందుకున్నారో తెలిసిందే. 2026 లో 1000 కోట్ల తెలుగు సినిమా? అనుకోకుండా కెరీర్లో గ్యాప్ తీసుకున్న కాజల్ పెళ్లి, ప్రెగ్నెన్సీ కారణంతో సిల్వర్ స్క్రీన్ నుంచి కెరీర్లో కాస్త గ్యాప్ తీసుకున్న కాజల్ కు అప్పటికే ఫామ్ తగ్గడంతో రీఎంట్రీ తర్వాత కూడా పెద్దగా అవకాశాలు రాలేదు. ఇంకా చెప్పాలంటే ఒకప్పుడు కమర్షియల్ హీరోయిన్ గా పరిగణించిన కాజల్ కు రీఎంట్రీ తర్వాత అసలు అలాంటి పాత్రలే రాలేదు. ఫలితంగా గత కొన్నేళ్లలో కాజల్ కెరీర్లో ఒక్క సాలిడ్ హిట్ కూడా లేదు. త్రయం.. మాటల్లేవ్ మాట్లాడుకోడాల్లేవ్!? దీంతో సెకండ్ ఇన్నింగ్స్ లో కాజల్ అగర్వాల్ కెరీర్ కష్టాల్లో పడిపోయింది. సీనియర్ హీరోలతో సినిమాలు చేసినా అమ్మడికి మంచి ఆఫర్లు రాలేదు. ప్రస్తుతం బాలీవుడ్ లో నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న రామాయణలో మండోదరి పాత్రలో నటిస్తున్న కాజల్ అగర్వాల్, ఇప్పుడు విశాఖ అనే వెబ్‌సిరీస్ లో ముగ్గురు పిల్లల తల్లి పాత్రకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. హీరోయిన్ గా సరైన అవకాశాలు రాకనే సెకండ్ ఇన్నింగ్స్ లో కాజల్ ఇలాంటి సపోర్టింగ్ రోల్స్ తో సరిపెట్టుకోవాల్సి వస్తుంది. మరి ఇలాగైనా కాజల్ బిజీగా మారుతారేమో చూడాలి.



Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com